ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

కలెక్టర్, ఎస్పీ హెచ్చరిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉచిత ఇసుక విధానంపై మరింత కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ మినీ కాన్ఫరెన్సు హాలులో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఎస్పీ జగదీశ్, జేసీ శివనారాయణ శర్మతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాకు పూర్తి అడ్డుకట్ట వేస్తాం. ఎవరు అక్రమాలకు పాల్పడినా ఉక్కుపాదం మోపుతామన్నారు. స్టాక్ యార్డు నుంచి నిల్వ కేంద్రానికి, అక్కడి నుంచి వినియోగదారులకు పటిష్టమైన నిఘా మధ్య రవాణా సాగాలి. రేవుల వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బందిని పెంచుతామన్నారు. త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్డీఓ, డీఎస్పీ స్థాయి అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. త్వరలోనే యల్లనూరులో ఇసుక నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రోజూ 3లక్షల మందికి ఉపాధి: రోజూ కనీసం 3లక్షల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆ ప్రాజెక్టు అధికారులతో వీక్షణ సమీక్ష జరిపారు. ప్రస్తుతం రోజూ 1.04లక్షల మంది మాత్రమే ఉపాధికి వస్తున్నారు. ఈ సంఖ్య మూడింతలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డ్వామా పీడీ సలీం బాషా, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఉద్యాన డీడీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్యారోగ్యశాఖ అధికారులు, వైద్యులతో సమావేశమై జిల్లాలోని ఆస్పత్రుల్లో మౌలిక వసతులు సమకూర్చాలన్నారు. నిర్దేశిత శాఖల్లో భర్తీ చేస్తున్న కారుణ్య నియామకాలు పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



శ్రీకరి.. శుభకరి

జిల్లాలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. అపురూప అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. సోమవారం అనంత నగరంలోని పాతూరు కన్యకాపరమేశ్వరి.. గజలక్ష్మిగా కొలువుదీరారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి.. అమ్మవారిని తిలకించి పులకించిపోయారు.

-న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

ఇటొచ్చారో.. ఇరుక్కుపోతారు!



ఉరవకొండ నుంచి విడపనకల్లు మండలం ఉండబండ దిశగా వెళ్లే ప్రధాన రహదారి మండలంలోని బూదగవి సమీపంలో దారుణంగా మారింది. దారి పొడవునా గుంతలు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షానికి గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు నరకప్రాయంగా తయారైంది. వాహనదారులు ఏమాత్రం పొరబడినా ఇరుక్కుపోయి ప్రమాదానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను ఆర్అండ్‌బీ ఏఈఈ కావ్య దృష్టికి తీసుకెళ్లగా.. రహదారి పునరుద్ధరణకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

-న్యూస్‌టుడే, ఉరవకొండ


కల్లు కాదు.. కాలకూటవిషం!



● ఉమ్మడి జిల్లాలో కల్తీతో విక్రయాలు ● చోద్యం చూస్తున్న యంత్రాంగం

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కల్తీ కల్లు ఏరులై పారుతోంది. సహజసిద్ధంగా చెట్ల నుంచి తీసిన కల్లు పది శాతం అవసరాలను తీర్చడం లేదు. వ్యవసాయ క్షేత్రాలు, రహస్య ప్రదేశాల్లో హానికర రసాయనాలతో తయారు చేస్తున్నారు. చాలా మంది కల్తీ కల్లుకు అలవాటు పడి.. రోజూ దాన్ని తాగకుండా ఉండలేని స్థితికి చేరుకుంటున్నారు. కొన్ని రోజులకు ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రుల పాలవుతున్నారు. కొందరు మతిస్థిమితం కోల్పోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇంతలా కల్తీ కల్లు మాఫియా రెచ్చిపోతున్నా ఎక్సైజ్ శాఖ పట్టించుకోవడం లేదు. మామూళ్ల మత్తులో మునిగి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



హిందూపురంలో కల్లు సీసాలు

డైజోఫాం కలిపేసి..

ఉమ్మడి జిల్లాలోని హిందూపురం, మడకశిర, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో డిమాండ్‌కు సరిపడా ఈత చెట్లు లేవు. దీన్ని అక్రమార్కులు ఆసరాగా చేసుకుని కల్తీ దందా సాగిస్తున్నారు. పది లీటర్ల స్వచ్ఛమైన కల్లుకు 150 లీటర్ల నీళ్లు కలుపుతారు. డైజోఫాం, క్లోరోహైడ్రేట్ తదితర రసాయనాలను వాడుతున్నారు. మొత్తం మిశ్రమాన్ని నీటి తొట్టెలో కలియ తిప్పుతారు. తీపి కోసం శాక్రిన్, నురగ రావడానికి అమ్మోనియం కలుపుతారు. ఇలా ఉదయం తయారు చేసిన మిశ్రమానికి ఈస్ట్ కలిపి సాయంత్రం వరకు పులియబెడతారు. ఆల్ఫ్రోజోలం అనే హానికరమైన రసాయనాన్ని వినియోగిస్తున్నారు. అల్ప్రాజోలం గ్రాము ధర రూ.500. ఒక గ్రాముతో డ్రమ్ము కల్లు తయారు చేయవచ్చు. అంటే సుమారు 300 సీసాలు తయారుచేసి ఒకదాన్ని రూ.40కు విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. రసాయనాలను హైదరాబాద్ నుంచి గుత్తి, గుంతకల్లు మీదుగా తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఉమ్మడి అనంత జిల్లాలో ఇలా..

- టీఎఫ్‌టీలు (ట్రీ ఫర్ ట్యాపర్): **337**
- కల్లుగీత కార్మికుల సహకార సంఘాలు: **159**
- లైసెన్సు కల్లు దుకాణాలు: **496**
- అనధికారంగా నిర్వహిస్తున్న దుకాణాలు: **900**

కొన్ని ఉదంతాలు..

- గత నెలలో హిందూపురం పరిధిలోని చౌళూరులో ఓ వృద్ధుడు కల్తీకల్లు తాగి చనిపోయాడు. విషయం బయటకు రానీయకుండా అధికారులు జాగ్రత్త పడినట్లు విమర్శలు ఉన్నాయి.
- పెనుకొండ మండలంలో గతేడాది కల్తీ కల్లు తాగి వ్యవసాయ కూలీలు అస్వస్థతకు గురయ్యారు. పనుల నుంచి సాయంత్రం తిరిగి వచ్చిన సుమారు 30 మంది కల్లు తాగడంతో వాంతులు, విరేచనాలు అయ్యాయి. అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.
- గతేడాది సెప్టెంబరులో పరిగి మండలంలోని ఓ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కల్తీకల్లు తాగి మృత్యువాతపడ్డాడు.

కొరవడిన పర్యవేక్షణ

ఎక్సైజ్ నిబంధనల ప్రకారం కల్లు దుకాణం పరిధిలో ఎన్ని ఈత చెట్లు ఉన్నాయి? వాటి నుంచి రోజుకు ఎంత ఉత్పత్తి అవుతోంది? అనే వివరాలు పక్కాగా ఉండాలి. ఈత చెట్లకు నంబర్లు కేటాయించాలి. ఎక్సైజ్ అధికారులు రెండు దశాబ్దాల కిందటి లెక్కలనే చూపుతున్నారు. నిబంధనల ప్రకారం ఎక్సైజ్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు కల్లు దుకాణాలను పర్యవేక్షించాల్సి ఉన్నా.. క్షేత్రస్థాయిలో ఆ దిశగా చర్యలు కొరవడ్డాయి. నమూనాలను ప్రాథమికంగా పరీక్షించడానికి అధికారుల వద్ద మినీ కిట్లు ఉంటాయి. అధికారులు నమూనాల ఫలితాలను వెల్లడించడం లేదు. కల్తీ తేలితే కొంత మొత్తం జరిమానా విధించి చేతులు దులుపుకొంటున్నారు.

నాడీ వ్యవస్థపై ప్రభావం

కల్తీ కల్లులో వాడే డైజోఫాం, క్లోరోహైడ్రేట్‌తో నాడీవ్యవస్థ తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆలోచనా శక్తి తగ్గి.. మతిమరుపు రావడంతోపాటు కాలేయం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. మానసిక, శారీరకంగా కుంగిపోయి.. కుటుంబం, సమాజం పట్ల విచక్షణా రహితంగా ప్రవర్తిస్తారు, దీర్ఘకాలిక వ్యసనంతో మరణం సంభవిస్తుందని పేర్కొంటున్నారు.

విస్తృతంగా తనిఖీలు చేస్తాం..

- నాగమద్దయ్య, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ శాఖ

కల్లులో డైజోఫాం, అల్ప్రాజోలం ఏమాత్రం కలపకూడదు. ఎప్పటికప్పుడు నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తాం. ఇప్పటివరకు కల్తీ కల్లుపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. అన్ని చోట్ల తనిఖీలు చేస్తాం. కల్తీ కల్లు తయారుచేసినట్లు తేలితే లైసెన్సు రద్దుతో పాటు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

సరకుల మూట.. పొదుపు బాట

➤ 'రైతు అంగడి' పేరిట విక్రయాలు ➤ సత్ఫలితాన్నిస్తున్న మహిళల ప్రయత్నం



శెట్టూరులో సరకుల కిట్లు విక్రయిస్తున్న సభ్యులు

ఉరవకొండ, కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాల(ఎఫ్‌పీవో) సభ్యులు వినూత్నంగా ఆలోచించారు. గ్రామాల్లో 'రైతు అంగడి' ఏర్పాటు చేసి పండగల పూట నిత్యావసర సరకులు విక్రయిస్తున్నారు. వారి ప్రయత్నం సత్ఫలితాన్నిస్తోంది. ఆ వచ్చిన లాభాలను పొదుపు చేస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని కళ్యాణదుర్గం, కూడేరు, కుందుర్పి, బెళుగుప్ప, శెట్టూరు, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో 14 రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘాలు(ఎఫ్‌పీవో) ఉన్నాయి. వాటిలో 5వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరంతా సమావేశమై పండగల సమయంలో కాస్త తక్కువ ధరకే ఓ కుటుంబానికి సరిపడే నిత్యావసరాలు విక్రయించాలని ఆలోచించారు. వీరికి ఏఎఫ్ ఎకాలజీ ప్రోత్సాహం అందిస్తోంది. మొత్తం రూ.14 లక్షల విలువైన 16 రకాల సరకులను హోల్‌సేల్‌గా కొనుగోలు చేశారు. వాటిని ఓ సంచిలో ఉంచి దసరా కిట్‌గా తయారు చేశారు. కిట్లను గ్రామాల్లో 'రైతు అంగడి' ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు 1000 కిట్లు తయారు చేశారు. ఒక్కోటి రూ.700కు అమ్ముతున్నారు. ఒక్కో కిట్టుపై రూ.50 లాభం వచ్చేలా నిర్ణయించారు. అది కూడా వారి ఎఫ్‌పీవోల పొదుపులోకి చేరనుంది. దీపావళి నాటికి 3వేల కిట్లు విక్రయించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు.

గ్రామీణులకు తోడ్పడాలన్న ఉద్దేశంతోనే..

పండగకు అవసరమైన సరకులు కొనేందుకు గ్రామీణులు పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. అందుకు వారు పనులు వదులుకుని, ఓ రోజంతా కేటాయించాలి. పైగా వ్యయ ప్రయాసకులోను కావాల్సి వస్తుంది. దీన్ని గుర్తించిన ఎఫ్‌పీవోలు పండగ సరకులను కిట్లుగా తయారు చేసి స్థానికంగా విక్రయిస్తున్నారు. ప్రజలు సైతం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

చక్కటి ఆదరణ లభిస్తోంది

- హేమలత, ఎఫ్‌పీవో ప్రతినిధి, కళ్యాణదుర్గం



మూడేళ్లుగా దసరా, ఉగాది పండగ సమయాల్లో సరకుల కిట్లు విక్రయిస్తున్నాం. ఈసారి పక్క మండలాలకు విస్తరించాం. గతంలో కంటే ఎక్కువ కిట్లు అమ్ముడుపోవడానికి అవకాశం ఉంది. గ్రామీణుల నుంచి చక్కటి ఆదరణ లభిస్తోంది. ఎఫ్‌పీవోల అభ్యున్నతి, గ్రామాల ప్రజలకు తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో దీన్ని చేపట్టాం. ఏఎఫ్ ఎకాలజీ అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారు.

శ్మశాన భూమికి పట్టా

కలెక్టర్‌కు బొమ్మకుంటపల్లి గ్రామస్థుల ఫిర్యాదు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: నార్పల మండలం బొమ్మకుంటపల్లి గ్రామంలో శ్మశాన భూమికి రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారని గ్రామస్థులు సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అర్జీలో పేర్కొన్న ప్రకారం.. సర్వే నెంబరు 32/1బీలో 3.3 ఎకరాల భూమి ఉంది. ఇందులో శ్మశానం, పంచాయతీ తాగునీటి బోర్లు ఉన్నాయి. అందులోనే కొంత మేర పెరిగిన గడ్డిని పశువులు మేస్తుంటాయి. ఓ వ్యక్తి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ భూమికి పట్టా చేసుకున్నాడు. ఈ బాగోతం బయటకు పొక్కకుండా ఇటీవల అదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తికి విక్రయించినట్లు తెలిసింది. సదరు వ్యక్తి భూమి తనదంటూ సాగు చేసుకోడానికి యత్నించాడు. రెండు తాగునీటి బోర్లను ధ్వంసం చేశాడు. గ్రామస్థులు అడ్డుకొని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దాంతో కలెక్టరేట్‌కు అర్జీ ఇచ్చి, సత్వరమే ఆ పట్టా రద్దు చేయాలని కోరారు. ప్రజల నుంచి మొత్తం 422 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్‌తోపాటు ఇన్‌ఛార్జి డీఆర్‌ఓ రమేశ్‌రెడ్డి, డీపీఓ నాగరాజు, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తదితరులు బాధితుల నుంచి వినతులు తీసుకున్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఫ్రీహోల్డ్ భూమి పరిశీలనలో కళ్యాణదుర్గం అధ్వానం

జిల్లాలో ఫ్రీహోల్డ్ భూమి పునఃపరిశీలనపై అధికార యంత్రాంగం నిర్లిప్తత ప్రదర్శిస్తే సహించేది లేదని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఈ విషయంలో కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పనితీరు చాలా అధ్వానంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 34వేల ఎకరాల భూమిని పునఃపరిశీలన చేయాలని ఆదేశించాం. ఇప్పటి దాకా 24వేల ఎకరాలు మాత్రమే పూర్తి చేశారు. ఇందులో ఒక్క కళ్యాణదుర్గం డివిజన్‌లోనే 9,338 ఎకరాలు ఉండటం బాధకరమన్నారు. జేసీ, ఆర్డీఓ ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఫిర్యాదులను బాధ్యతగా పరిష్కరించండి

అనంతపురం(కమలానగర్),న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికకు 99 వినతులు వచ్చాయి. ఎస్పీ జగదీశ్... వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలు విన్న ఎస్పీ అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాజుల అమరేశ్వర.. జేబీఎన్ విలేకరినని చెప్పుకొంటూ 30 సెంట్ల భూమి కాజేసేందుకు కుట్ర పన్నుతున్నాడని కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన పుష్పావతి.. ఎస్పీకి ఫిర్యాదు చేశారు. రెండో కుమారుడు రెండేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని పేరుపై ఉన్న 30 సెంట్ల భూమికి నెల కిందట అగ్రిమెంట్ చేసుకున్నట్లు అమరేశ్వర తప్పుడు పత్రాలు సృష్టించారన్నారు. న్యాయం చేయాలని వేడుకొన్నారు.

ఏడీసీసీ బ్యాంకులో అమృత్‌కాల్ డిపాజిట్ పథకం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో అమృత్‌కాల్ డిపాజిట్ పథకాన్ని సోమవారం సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ ప్రారంభించారు. బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జిగా ఉన్న ఆయన.. బ్యాంకు పథకాలను ప్రజలకు, రైతులకు చేరువ చేయడానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా డిపాజిట్ పథకానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పథకం కింద 444 రోజులకు డిపాజిట్ చేస్తే సీనియర్ సిటిజన్లకు 8.35 శాతం, ఇతరులకు 7.85 వడ్డీ చెల్లిస్తామని ఆయన వివరించారు. బంగారు ఆభరణాలపై రుణాల మంజూరును సరళీకృతం చేశామన్నారు. జిల్లాలోని సహకార బ్యాంకుల శాఖల్లో లాకర్ సదుపాయం కల్పించామన్నారు. ఇతర బ్యాంకుల అద్దెతో పోల్చితే ఇక్కడ తక్కువ అద్దెతోనే లాకరు సదుపాయం కల్పిస్తామని తెలిపారు. బ్యాంకు సీఈఓ సురేఖరాణి, సీనియర్ మేనేజరు అనంత పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ పాలకమండలి సమావేశానికి సన్నాహాలు



ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పాలకమండలి సమావేశం నిర్వహణపై కసరత్తు సాగుతోంది. పాలకమండలి చివరి సమావేశం గత జులైలో జరిగింది. ఈనెల 7 నాటికి పాలకమండలి సమావేశం నిర్వహించి 3 నెలలవుతుంది. ఈమేరకు వర్సిటీ యంత్రాంగం సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే అన్ని విభాగాలకు సర్క్యులర్ పంపించారు. చర్చించాల్సిన అంశాల నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులకు సూచించారు. నివేదికలు వచ్చిన వెంటనే అజెండా రూపొందించనున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నియమితులైన నామినేటెడ్ సభ్యులు ఇప్పటికీ కొనసాగుతున్నారు. నూతన పాలకమండలి ఏర్పాటు అయ్యే వరకూ పాత పాలకవర్గం కొనసాగుతుంది. పాలకమండలిలో చర్చించాల్సిన అంశాలు ఎక్కువగానే ఉన్నట్లు సమాచారం. వర్సిటీలోని వివిధ అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

దసరా తర్వాత నిర్వహిస్తాం..

- ఆచార్య బి.అనిత, ఇన్‌ఛార్జి ఉపకులపతి, ఎస్కేయూ

ప్రస్తుతం అజెండా రూపొందిస్తున్నాం. దసరా పండగ అనంతరం సమావేశమవుతాం. ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహిస్తాం.

మున్సిపల్ ఖజానా ఖాళీ

కుంటుపడుతున్న పట్టణాభివృద్ధి



రాయదుర్గంలో పన్ను వసూలు చేస్తున్న ఆర్ఐ సత్యనారాయణ, సిబ్బంది

రాయదుర్గం, న్యూస్‌టుడే: జిల్లాలోని నగరపాలక, పురపాలక సంఘాల్లో కొన్ని నెలలుగా పన్నుల వసూళ్లు మందగించాయి. ఫలితంగా ఖజానాలు ఖాళీ అవుతున్నాయి. కొన్నింటిలో లక్ష్యాలు అధిగమించినా.. ఎక్కువ మున్సిపాలిటీల్లో వెనుకబడ్డాయి. దాంతో పట్టణాభివృద్ధి కుంటుపడుతోంది. రోడ్లు, మురుగు కాలువలు వంటి పనులకు ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడాల్సి వస్తోంది. గత వైకాపా పాలనలో వివిధ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులు కూడా పడకేశాయి. వాటిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంతో పట్టణాభివృద్ధిపై అనిశ్చితి నెలకొంది.

ప్రతి పనికి పన్నులపైనే ఆధారం

పురపాలక సంఘాల్లో కొన్నేళ్లుగా పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు జరగడం లేదు. దాంతో ఔట్‌సోర్సింగ్ కార్మికులను నియమించారు. వారికి సాధారణ నిధులతోనే జీతాలు ఇవ్వాల్సి వస్తుంది. ఎక్కువ భాగం నిధులు వారి జీతాలకే సరిపోతుంది. వీధి దీపాలకు ప్రతినెలా ఎల్‌టీ(లోటెన్షన్), నీటి నిర్వహణకు అయ్యే హెచ్‌టీ(హైటెన్షన్) బిల్లులు కూడా రూ.లక్షల మేర చెల్లించాల్సి ఉంటుంది. పారిశుద్ధ్య నిర్వహణకు మందులు, పరికరాలు, డీజిల్ బిల్లులు, తాగునీటి శుద్ధికి కోలరిన్ గ్యాస్, ఆలం కొనుగోళ్లు, విద్యుత్తు నియంత్రికలు, మోటార్లు, లీకేజీ మరమ్మతులు, మున్సిపల్ ఖర్చులకు పన్నులపైనే ఆధారపడాల్సి ఉంటుంది.

నగరపాలిక/పురపాలక సంఘం	పన్నులు లక్ష్యం(రూ.కోట్లు)	వసూలైంది (రూ.కోట్లు)
అనంతపురం	36.90	19.89
గుంతకల్లు	8.38	4.66
తాడిపత్రి	5.24	4.25
గుత్తి	3.10	1.89
రాయదుర్గం	3.45	1.41
కళ్యాణదుర్గం	3.52	1.18
హిందూపురం	11.55	4.22
ధర్మవరం	6.36	2.91
కదిరి	4.57	2.27
పుట్టపర్తి	3.64	1.21
పెనుకొండ	1.08	0.85
మడకశిర	1.91	0.60

లక్ష్యాల సాధనలో వెనుకబాటు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12 పురపాలక సంఘాలు ఉన్నాయి. గత ఏప్రిల్ ఒకటి నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు అర్ధ భాగం, అక్టోబరు 1 నుంచి 2025 మార్చి నెలాఖరు వరకు రెండో అర్ధ భాగం ఆయా పట్టణాల్లో వార్షిక పన్నులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్థిక సంవత్సరంలో అర్ధ భాగం పూర్తయ్యింది. సాధారణ ఎన్నికలు, ఉద్యోగుల బదిలీలు, కరవు పరిస్థితులతో వ్యాపారాలు తగ్గటం, ఇసుక కొరతతో పనులు లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొని రెండో అర్ధ భాగంలో చెల్లిస్తామనుకోవటం తదితర కారణాలతో పన్నులు వసూలు కాలేదు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తాం..

ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం చేసేందుకు 125 రోజుల ప్రణాళికతో బృందాలు ఏర్పాటు చేస్తాం. రోజువారీ లక్ష్యాలను నిర్దేశిస్తాం. ఎక్కువ బకాయిలు చెల్లించని వంద మంది జాబితాలు సిద్ధం చేసి, వసూలు చేస్తాం. మూడేళ్లకు పైబడి బకాయిదారులపై ఛార్జిషీట్లు దాఖలు చేసి కోర్టుకెళతాం. రెవెన్యూ రికవరీ యాక్టు కింద ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పన్నుల బకాయి వసూళ్లు చేపడతాం.

- పి.విశ్వనాథ్, ప్రాంతీయ సంచాలకులు, పురపాలకశాఖ, అనంతపురం

చిన్నారిని వదిలివెళ్లిన తల్లి ఆచూకీ లభ్యం



చిన్నారిని శిశువిహార్ సిబ్బందికి అప్పగిస్తున్న ఐసీడీఎస్ ఉద్యోగులు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి ఆర్టీసీ బస్టాండులో ఆదివారం ఐదునెలల చిన్నారిని వదిలివెళ్లిన మహిళ ఆచూకీని పోలీసులు గుర్తించారు. వివరాలు.. అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన జ్యోతికి అదే ప్రాంతానికి చెందిన వ్యక్తితో పెళ్లయింది. ఇద్దరు పిల్లలయ్యాక భర్త మృతిచెందాడు. పిల్లలిద్దరూ అత్తమామల వద్దే ఉండటంతో జ్యోతి ఉపాధి కోసం బెంగళూరుకు వలస వెళ్లింది. కర్ణాటకలోని బేతం గ్రామానికి చెందిన కుమార్‌ను రెండో పెళ్లి చేసుకుంది. పాప పుట్టాక భర్త నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. రెండో భర్త వేధింపులు భరించలేక జ్యోతి ఐదునెలల బిడ్డతోపాటు ఎక్కడికైనా వెళ్లిపోవాలని నిర్ణయించుకుని కదిరికి చేరుకుంది. ఏం చేయాలో అర్థం కాక బిడ్డను ఆదివారం సాయంత్రం బస్టాండులో ఓ యువతికి అప్పగించి చనిపోవాలని నిర్ణయించుకుంది. పాప పదేపదే గుర్తుకొస్తుండటంతో ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనను విరమించుకుని రాత్రంతా కదిరి పట్టణ శివారులో ఉండిపోయింది. కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు గాలింపు చేపట్టారు. ఒంటరిగా ఉన్న జ్యోతిని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా అసలు విషయం చెప్పింది. కౌన్సెలింగ్ అనంతరం జ్యోతిని ఆమె సమీప బంధువులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

శిశువిహార్‌కు చిన్నారి

ఐదునెలల చిన్నారిని స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు ఐసీడీఎస్ సిబ్బందికి అప్పగించారు. ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులు పాపను అనంతపురంలోని ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరచగా చిన్నారి సంరక్షణ దృష్ట్యా పుట్టపర్తిలోని శిశు విహార్‌కు అప్పగించినట్లు కదిరి పట్టణ పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది తెలిపారు.

ఆదాయానికి మహాగని

మడకశిర గ్రామీణం, అమరాపురం, న్యూస్‌టుడే: మడకశిర నియోజకవర్గంలో రైతులు వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగానే గుడిబండ, అమరాపురం మండలాల్లో కొందరు రైతులు సుమారు 10 ఎకరాల్లో మహాగని చెట్లు పెంచుతున్నారు. ఇది దీర్ఘకాలిక పంట. రూ.లక్షల్లో ఆదాయం పొందవచ్చని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 400 మొక్కలు నాటుకోవచ్చు. రెండేళ్ల వరకు మొక్కలకు నీరందిస్తే.. ఆపైన అవసరం ఉండదు. ఒక్కో చెట్టు 70 అడుగుల వరకు పెరుగుతుంది. బంజర భూముల్లో కూడా సాగు చేయొచ్చు. 13 ఏళ్ల తరువాత చెట్లు కోతకు వస్తాయి. 20 ఏళ్ల వరకు ఆగితే కలపకు మంచి గిరాకీ ఉంటుంది. ఒక అడుగు కలప రూ.1300 నుంచి రూ.2వేల వరకు ధర పలుకుతుంది. ఈ లెక్కన కనీసం 50 అడుగులకు లెక్కగట్టినా ఒక్కో చెట్టుపై రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది.



అమరాపురం మండలం గుణేహళ్లి వద్ద మహాగని చెట్లు

రైతేరాజు

కలపకు డిమాండ్

మహాగని కలప.. టేకు కన్నా గట్టిగా ఉంటుంది. దీన్ని గృహోపకరణాలు, వివిధ ఉపకరణాల తయారీకి వాడతారు. ఇది ఉప్పు నీటిలో పాడవదు. ఎక్కువగా పడవల తయారీకి ఉపయోగిస్తారు. దీని గింజలను డయాబెటిక్‌కు ఉపయోగిస్తారు. కిలో విత్తనం వేల రూపాయల ధర పలుకుతుందని చెబుతున్నారు.

అంతర పంటలు సాగు చేసుకోవచ్చు

10/10 అడుగుల విస్తీర్ణంలో మహాగని మొక్కలు నాటుకుని వాటి మధ్య బొప్పాయి. జామ, మిరియాలు, అరటితోపాటు కూరగాయలు సాగు చేసుకోవచ్చు. 20 ఏళ్లకు కలప కోతకు వస్తుండటంతో అంత వరకు రైతులకు అదనంగా ఆదాయం రావాలంటే అంతర పంటలు సాగుచేసుకోవచ్చు.

ఖర్చు, శ్రమ తక్కువ..



కర్ణాటకలోని ధర్మస్థలలో మహాగని పంట గురించి తెలుసుకున్నా. ఒక్కో మొక్కను రూ.70 చొప్పున మొత్తం 1,200 మొక్కలు తెచ్చాను. వాటిని 2.25 ఎకరాల్లో నాలుగేళ్ల కిందట నాటాను. అంతర పంటలుగా బొప్పాయి, జామ వేశా. మహాగని చెట్టుకు ఎలాంటి మందులు, ఎరువుల అవసరం ఉండదు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చు. మొక్కలు ఇచ్చిన డీలర్లు ఐదేళ్లకోసారి వచ్చి వడ్డీ లేకుండా రూ.50వేల వరకు ఇస్తారు. చెట్లు ఎత్తు పెరిగాక ఆ మొత్తాన్ని తిరిగి తీసుకుని, కలపను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. **- గురుమూర్తి, గుణేహళ్లి, అమరాపురం మండలం**

సమస్య-సమాధానం



నజీరుద్దీన్(వ్యవసాయ శాస్త్రవేత్త, రేకులకుంట పరిశోధనా కేంద్రం)

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: పంటల సాగులో రైతులకు ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త నజీరుద్దీన్ 99665 05285 నంబరుకు ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య: నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాం. పొలంలో అక్కడక్కడ మొక్కలు వాడిపోయి, క్రమంగా ఎండిపోతున్నాయి. సమస్యకు పరిష్కారం తెలపండి. **- నల్లప్ప(ఆకులేడు)**

సమాధానం: పత్తిలో ఎండు తెగులు నివారణకు వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లలో నేల తడిచే విధంగా పోయాలి.

సమస్య: ప్రస్తుతం కంది పంట పూత, పిందె దశలో ఉంది. పంటకు మారుక గూడు పురుగులు ఆశించాయి. వాటిని ఎలా నివారించాలి. **- సురేశ్(కొర్రపాడు)**

సమాధానం: కంది పంటకు ఆశించిన మారుక గూడు పురుగులను నివారించడానికి వేపమందు 5 మి.లీ, క్లోరాంత్రీనిఫోల్ 0.3 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్నలో తెగుళ్లు నివారిస్తే అధిక దిగుబడి

చిట్కా

మొక్కజొన్న పంటకు వ్యాపించే తెగుళ్లను సకాలంలో నివారిస్తే అధిక దిగుబడి పొందవచ్చని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 3 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోందని అన్నారు. పంటకు ప్రధానంగా ఆశించే కత్తెర పురుగుల నివారణకు 9 కిలోల ఇసుకకు, 2 శాతం సున్నం కలిపి మిశ్రమంగా చేసుకుని సుడుల్లో వేయాలని తెలిపారు. పురుగుల ఉద్ధృతి మరీ అధికంగా ఉంటే ఇమామెక్టిమ్ బెంజోయేట్ 0.4 గ్రాములు, క్లోరాంత్రనిలిప్రోల్ 0.5 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కంకి నాణ్యత పెరగడానికి పిందె దశలో ఎకరాకు 50 కిలోల యూరియా పొలంలో చల్లుకోవాలని శాస్త్రవేత్త సూచించారు.

– న్యూస్‌టుడే, నార్పల



జంతులూరులో సాగవుతున్న మొక్కజొన్న పంట

అద్దెకు వ్యవసాయ యంత్ర పరికరాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తలు రైతుల కోసం నామమాత్రపు ధరకు వ్యవసాయ యంత్ర పరికరాలను అద్దెకు ఇస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో రబీ వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. బోర్లు, సాగునీటి కాలువల కింద పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ యంత్రాలు, పరికరాలు కొనుగోలు చేయలేని వారి కోసం పరిశోధనా కేంద్రంలో 300పైగా యంత్రాలు అందుబాటులో ఉంచారు. పవర్ టిల్లర్లు, మడకలు, గొర్రు, గుంటక, అనంత విత్తుగొర్రు, వేరుసెనగ, మొక్కజొన్న, కంది, వరి నూర్పిడి యంత్రాలు ఇలా అనేక పరికరాలను అందుబాటులో ఉంచారు. అవసరమైన రైతులు నామమాత్రపు డిపాజిట్ చెల్లించి తీసుకెళ్లవచ్చని ప్రధాన శాస్త్రవేత్త విజయ్ శంకర్‌బాబు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



రేకులకుంట పరిశోధనా కేంద్రంలో యంత్రాలు

జీబీసీ గండి పూడ్చివేత పనులకు శ్రీకారం



పొక్లెయిన్‌తో పనులు చేయిస్తున్న అధికారులు

విడపనకల్లు (ఉరవకొండ), న్యూస్‌టుడే: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ) గండి పూడ్చివేత పనులను సోమవారం అధికారులు ప్రారంభించారు. 28.5 కి.మీ. వద్ద గండి పడిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మంత్రి జీబీసీ ఈఈ వెంకటరమణతో చరవాణిలో మాట్లాడారు. కాలువ ఆయకట్టు కింద ఇప్పటికే రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారని, గండి పూడ్చివేత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ఈఈ, డీఈఈ రఘువరన్, తెదేపా నాయకులు శీన, భీమలింగప్ప, సీతారాముడు, రామాంజనేయులుతో కలిసి గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. పొక్లెయిన్‌తో మరమ్మతు పనులు చేపట్టారు. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తవడానికి అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తుకు 15 వరకు గడువు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ప్రతిభ ఉపకార వేతనాలు (ఎన్ఎంఎంఎస్) కోసం నిర్వహించే పరీక్ష దరఖాస్తుకు గడువు ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు పరీక్షల విభాగం సహాయ సంచాలకులు గోవిందనాయక్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ఆసక్తి ఉన్న వారు ప్రధానోపాధ్యాయుడి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమగ్రశిక్షా ఉద్యోగులకు వేతనాలు మంజూరు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సమగ్రశిక్షా ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు సంబంధించిన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లాలో సుమారు 2,800 మంది పని చేస్తున్నారు. దసరా పండగ సమీపిస్తున్న తరుణంలో బడ్జెట్ విడుదల కావడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వేతనాలు చెల్లించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

బాలికల కబడ్డీ పోటీల్లో అనంతకు ద్వితీయ స్థానం



బహుమతిని అందుకుంటున్న అనంతపురం జట్టు క్రీడాకారులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల కబడ్డీ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 156 మంది క్రీడాకారులు రెండు రోజుల పాటు హోరాహోరీగా తలపడి క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ పోటీల్లో విశాఖపట్నం జట్టు ప్రథమ, అనంతపురం జట్టు ద్వితీయ, శ్రీకాకుళం జట్టు తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన ఉత్తమ క్రీడా నైపుణ్యాలు ప్రదర్శించిన 17 మంది క్రీడాకారులను జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే ఈ క్రీడాకారులకు కొద్ది రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒలింపిక్ సంఘ ముఖ్య సలహాదారులు పి.సుందరరావు, పీడీ, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృత్యువాత



ఓబుళప్ప

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన చెన్నేకొత్తపల్లి మండలంలోని యర్రంపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. న్యామద్దల గ్రామానికి చెందిన ఓబుళప్ప(75) యర్రంపల్లి వద్ద ఉన్న బంధువుల రైస్‌మిల్‌లో ఉండేవారు. ఆదివారం తెల్లవారుజామున టీ తాగేందుకు సమీపంలోని ఓ దాబా వద్దకు వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన ఓ వ్యక్తి గమనించి చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చాడు. అతడు అవివాహితుడు. ఆయన మేనల్లుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో తెదేపా నాయకుడి బలవన్మరణం



రాజారెడ్డి

రాప్తాడు, న్యూస్‌టుడే: అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన తెదేపా నాయకుడు రాజారెడ్డి(38) సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులు, గ్రామస్థుల వివరాల మేరకు.. రాజారెడ్డి అప్పులు, ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోని తోటకు వెళ్లి పురుగు మందు తాగారు. మెడలో తాడుతో సెల్ఫీ తీసుకుని, వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశారు. అనంతరం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉన్న రాజారెడ్డి మృతదేహానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో అటెండరు దుర్మరణం



లాలెప్ప

పామిడి, న్యూస్‌టుడే : మండలంలోని గజరాంపల్లి గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పామిడి అంబేడ్కర్ కాలనీకి చెందిన లాలెప్ప (56) గుత్తి ఆదర్శ పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం గుత్తి నుంచి పామిడి వైపు వస్తుండగా గజరాంపల్లి గ్రామ సమీపాన వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శాస్త్రీయ విద్యకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అనంతపురం (గుల్జార్‌పేట), న్యూస్‌టుడే: శాస్త్రీయ విద్య కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత సమావేశాల్లో మూడో రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో వస్తున్న మార్పులపై అధ్యయనం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో అశాస్త్రమైన భావాలను పాఠ్య పుస్తకాల్లో జొప్పిస్తుందన్నారు. విద్యార్థులు, ప్రజలు చైతన్యవంతులై పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు రామ్మోహన్, పరమేశ్, వినోద్‌నాయుడు, అబ్దుల్లా పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా దాదాగాంధీ



ఉమానగర్(అనంతపురం), న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా అనంత నగరానికి చెందిన దాదాగాంధీ నియమితులయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి వేణుగోపాల్ సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దాదాగాంధీ గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన నియామకంపై జిల్లా కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సత్యసాయి తాగునీటి పంపింగ్ ప్రారంభం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం చెరువులో ఉన్న సత్యసాయి తాగునీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులకు అధికారులు హెచ్చెల్సీ నీరు పంపింగ్ చేయడం ప్రారంభించారు. ట్యాంకుల్లో నీటి నిల్వలు లేకపోవడంతో బుక్కరాయసముద్రం, అనంతపురం గ్రామీణం, రాప్తాడు మండలాలకు గత 4 నెలలుగా సత్యసాయి తాగునీటి పథకం నీరు సరఫరా ఆగిపోయింది. దీనికితోడు కార్మికులు కూడా సమ్మె చేయడంతో గ్రామాలకు తాగునీరందడం లేదు. తాజాగా హెచ్చెల్సీ కాలువలకు అధికారులు నీరు విడుదల చేయడంతో రెండు మోటార్ల ద్వారా నీటికి ట్యాంకులకు ఎత్తిపోస్తున్నారు.

స్నేహితులే.. కడతేర్చారు

- హత్య కేసు ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు, పోలీసు అధికారులు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: స్నేహితులే తోటి మిత్రుడిని బండ రాయితో కొట్టి కడతేర్చినట్లు డీఎస్పీ రవిబాబు తెలిపారు. సోమవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. రాయదుర్గం పురపాలకంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సన్నయ్యగారి కొల్లప్ప (43) కనబడటం లేదని అన్న ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. ఈనెల 1వ తేదీన పట్టణ శివారులోని గౌడ లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇంట్లో కొల్లప్ప శవమై కనిపించాడు. తన తమ్ముడిని హత్య చేశారని అన్న ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. వాలంటీర్‌గా పని చేస్తున్న పవన్ కుమార్ కొల్లప్పకు పరిచయమయ్యాడు. పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడటంతో పవన్‌కుమార్‌ను తొలగించారు. మున్సిపాలిటీలో ఉద్యోగం కావాలని కొల్లప్పను అడగగా కొంత నగదు అడ్వాన్సుగా ఇచ్చాడు. వీరి ఇద్దరికి మధుసూదన్ అనే యువకుడు కూడా పరిచయమయ్యాడు. ముగ్గురు కలిసి మద్యంతో పాటు వ్యసనాలకు బానిసలయ్యారు. ఇందులో భాగంగానే సెప్టెంబరు 30న జగనన్న కాలనీలో ముగ్గురూ కలిసి మద్యం తాగారు. ఉద్యోగానికి ఇచ్చిన నగదు వెనక్కి ఇవ్వాలని గొడవపడ్డారు. మద్యం మత్తులో కిందకు పడిన కొల్లప్ప తలపై పవన్‌కుమార్, మధుసూదన్ బండరాయి వేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. శవాన్ని నిర్మాణంలో ఉన్న ఇంట్లో పడేసి పరారయ్యారు. హత్య జరిగిన రోజు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొల్లప్ప ఒక వీడియో పోస్ట్ చేయడంతో దాని ఆధారంగా విచారణ చేయగా ఇద్దరు కలిసి హత్య చేసినట్లు అంగీకరించారని డీఎస్పీ తెలిపారు. హత్యకు ఉపయోగించిన రాయితో పాటు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. సాంకేతికత ఆధారంగా కేసును ఛేదించిన సీఐ జయనాయక్, ఎస్ఐ వలితో పాటు సిబ్బందిని ఎస్పీ జగదీశ్ అభినందినట్లు వివరించారు.

పాముకాటుతో రైతు మృతి



లేపాక్షి

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: పొలంలో మొక్కజొన్న పంట కోసేందుకు వెళ్లిన రైతు లేపాక్షి (42) పాముకాటుకు గురై మృతిచెందిన ఘటన మండలంలోని భూపసముద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పొలంలో పనిచేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే గమనించి బంధువులు రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య సునీతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇంటి పెద్దదిక్కు మృతితో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

బాణసంచా పట్టివేత.. కేసు నమోదు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని తేరువీధిలో రూ.64,800 విలువ చేసే బాణసంచాను 1వ పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ముంటిమడుగు రెడ్డిసాయి అనేవ్యక్తి బాణసంచాను తీసుకువచ్చి ఇంట్లో నిల్వ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో 1వ పట్టణ ఇన్‌ఛార్జి సీఐ రెడ్డెప్ప, సిబ్బంది దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా బాణసంచాను విక్రయించేందుకు తీసుకొచ్చిన రెడ్డిసాయిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పంచలోహ విగ్రహాలు స్వాధీనం

నిందితులు కోర్టుకు హాజరు



విగ్రహాలు, నిందితులతో ఎస్సై వెంకటనారాయణ, సిబ్బంది

అమడగూరు, న్యూస్‌టుడే: మండలంలోని తుమ్మలకొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాలను దొంగలించిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని సోమవారం కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై వెంకటనారాయణ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆగస్టు 27న తుమ్మలకొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి, పద్మావతిదేవిల పంచలోహ విగ్రహాలు, స్వామివారి వెండి ముఖ కవచం, గొడుగు చోరీ జరిగినట్లు కొత్తపేట, వెంకటనారాయపల్లి ప్రజలు ఫిర్యాదు చేశారు. ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు సోమవారం ఓబుళదేవరచెరువు మండలం మామిళ్లకుంట్లపల్లిలో నివాసం ఉంటున్న నగిరిగిరి గంగరాజు, ధర్మవరం మండలం ఎలక్కుంట్ల గ్రామానికి చెందిన చెడిపోతుల నాగరాజును వెంకటనారాయపల్లి మూడురోడ్ల కూడలిలో అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి పంచలోహ విగ్రహాలు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గంగారాజు గతంలో కూడా ఓబుళదేవరచెరువు మండలం తిప్పేపల్లిలో రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాలను చోరీ చేసినట్లు గుర్తించి వాటిని కూడా రికవరీ చేసినట్లు ఎస్సై వెంకటనారాయణ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. సిబ్బంది సూర్యనారాయణ, విజయ్‌భాస్కర్, జబీవుల్లా, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

కూలి పనులకొచ్చి.. మృత్యుఒడికి

వీధిదీపాలు ఏర్పాటు చేస్తూ విద్యుదాఘాతం



నగేశ్

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : పెద్దవడుగూరులోని జామియా మసీదు కాలనీలో సోమవారం వీధి దీపాలు ఏర్పాటు చేస్తూ కూలీ నగేశ్ (40) విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనుంచి పడి మృతి చెందాడు. చింతలచెరువు గ్రామానికి చెందిన అతను పంచాయతీ సర్పంచి ఆదేశాల మేరకు వీధి దీపాలు ఏర్పాటు కోసం కూలి పనులకు వచ్చాడు. విద్యుత్తు సరఫరా నిలిపేసి అతను స్తంభం ఎక్కాడు. వీధి దీపాలు సరిచేస్తున్న సమయంలో ఒక్కసారిగా విద్యుత్తు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై పై నుంచి కిందపడ్డాడు. నగేశ్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విద్యుత్తు సరఫరా నిలిపివేసినా విద్యుదాఘాతానికి గురికావడంపై విద్యుత్తు అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాలనీలోని కొందరు ఇళ్లల్లో ఇన్వర్టర్ ఉండటం వల్ల విద్యుత్తు తిరిగి సరఫరా అయి ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. నగేశ్‌కు భార్య భోగేశ్వరి, ఇద్దరు కుమారులున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్నరెడ్డెప్ప ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. భార్య భోగేశ్వరి నగేశ్ మృతదేహంపై పడి బోరున విలపించడం అందరినీ కలచివేసింది. చిన్నవడుగూరుకు చెందిన తెదేపా నాయకుడు దివాకర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.



ఘటనాస్థలంలో భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భోగేశ్వరి

రాయదుర్గం

●రాయదుర్గం ●కళ్యాణదుర్గం ●ఉరవకొండ

వేడుకగా గంగాజలం ఊరేగింపు



ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఉరవకొండ: మండలంలోని బూదగవి మారెమ్మ ఆలయ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం గంగా జలాన్ని (జల్దిబిందె) ఊరేగింపు ఉదకకొండ నుంచి చేపట్టారు. ప్రభుత్వ విశ్రాంత భవనం సమీపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. యువకులు కలశాలు చేతబట్టి ముందు నడిచారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాయంత్రం గంగాజలం అమ్మవారి ఆలయానికి చేరింది. అర్చకులు జలంతో ప్రత్యేక పూజలు చేశారు.

రాళ్లనంతపురంలో సచివాలయానికి తాళం

కంబదూరు, న్యూస్‌టుడే: మండలంలోని రాళ్లనంతపురంలో సచివాలయానికి సోమవారం తాళం వేసి గంటపాటు నిరసన చేపట్టారు. సర్పంచి గదిలో ఉన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలు మార్చడంతో తెదేపా నాయకుడు నాగరాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఫొటోలను యథాస్థానంలో పెట్టడంతో సమస్య సద్దుమణిగింది.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా మంజునాథ్

వజ్రకరూరు: వజ్రకరూరు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా మంజునాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న శివరామకృష్ణ విడపనకల్లు జిల్లాలోని నగరి బదిలీ అయ్యారు. గుత్తిలో పనిచేస్తున్న మంజునాథ్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తానని తెలిపారు.

ఎమ్మెల్యే సురేంద్రబాబుకు అభినందనల వెల్లువ



సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ లీడర్ షిప్ అవార్డు అందుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సోమవారం కళ్యాణదుర్గం వచ్చారు. ఆయన్ని ప్రజావేదిక వద్ద నాయకులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

● బళ్లారి రోడ్డులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నిర్మించిన అన్న క్యాంటీన్‌ను ఈనెల 9న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

● ప్రజావేదిక వద్ద పలు సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు అందజేశారు. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పట్టణవాసులు తెలపడంతో వెంటనే మరో ఐదు ట్యాంకర్లతో సరఫరా చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. పలువురు ఇళ్ల స్థలాల పట్టాలు రిజిస్ట్రేషన్ కావడం లేదని తెలుపగా సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పెన్నహోబిలంలో లోపించిన పారిశుద్ధ్యం

● ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం
● భక్తులు, పర్యాటకులకు అసౌకర్యం


ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం పెన్నహోబిలంలో పారిశుద్ధ్యం లోపించింది. దానిని మెరుగుపరచే దిశగా చర్యలు చేపట్టకపోవడంతో సమస్య అధికమవుతోంది. ఇక్కడి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శని, ఆది వారాల్లో కనీసం 6 వేల నుంచి 8 వేల మంది వరకు భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం తరుచూ లోపిస్తోంది. ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి అస్తవ్యస్తంగా ఉంది. ఎక్కువ మంది కుటుంబం, మిత్రులతో కలిసి వస్తుంటారు. ఇక్కడే భోజనం చేయడానికి ఇష్ట పడుతుంటారు. అయితే అపరిశుభ్రత మధ్య చేయడానికి అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. కనీసం వారానికి ఒకసారి కూడా పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టడం లేదు. ఆలయ తూర్పు గోపురం పక్కన పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. బుగ్గ కోనేరు పరిసరాల్లో చెట్ల కింద ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. అయితే కాలువలో నీరు లీకేజీ వల్ల అవకాశం లేకుండా పోయింది. దీనిని మెరుగుపరిచే దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం

వేధిస్తున్న కోతుల సంచారం..

పెన్నహోబిలంలో కోతుల సంచారం రోజురోజుకు అధికమవుతోంది. ఆలయంతో పాటు పరిసరాల్లో గుంపులుగా సంచరిస్తూ భక్తుల మీద దాడికి తెగ పడుతున్నాయి. చేతిలో చిన్న సంచిని పట్టుకుని వెళ్లాలన్నా కష్టమే. కట్టెలు పట్టుకుని కాపలా ఉండాల్సిన పరిస్థితి. వాటి కారణంగా నిత్యం భక్తులు భయాందోళనకు గురి కావడమే కాకుండా స్వేచ్ఛగా తిరగలేని దుస్థితి నెలకొంది. కోతుల సంచారాన్ని నియంత్రించేలా చర్యలు లేకపోవడంతో వాటి సంతతి క్రమంగా పెరుగుతోంది.



ఆలయ తూర్పు గోపురాన్ని ఆనుకుని పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

పెన్నహోబిలం ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపడతాం. ఉన్నతాధికారుల అనుమతితో కార్మికులను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పనులను నిర్వహిస్తాం. భక్తులు, పర్యాటకులు ఆహ్లాదంగా గడపడానికి ఉన్న అవకాశాలను మెరుగుపరుస్తాం.
- రమేశ్‌బాబు, ఆలయ ఈవో, పెన్నహోబిలం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: ముచ్చర్లపల్లి వీధుల్లో అపరిశుభ్రత పేరుకుపోయింది.- **ఈరణ్ణ**
సమాధానం: తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.
- ఈవోఆర్డీ రఘురామ్

సమస్య: కనుకూరు చెరువుకట్ట కింద ముళ్లపొదలతో ఇబ్బందిగా ఉంది. **- చలపతి**
సమాధానం: ఉపాది పథకం కింద తొలగింపునకు చర్యలు చేపడుతాం. **- ఈవోఆర్డీ రఘురామ్** **- న్యూస్‌టుడే, శెట్టూరు**

చిరుతల సంచారంపై గస్తీ

కళ్యాణదుర్గం గ్రామీణం: మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి సమీపంలోని కొండలో చిరుతలు సంచరిస్తుండటంతో వాటిని గుర్తించేందుకు అటవీ శాఖ అధికారులు గాలింపు చేపడుతున్నారు. 'జీవాల పై చిరుతల పంజా' అనే శీర్షికన 'ఈనాడు'లో వరుస కథనాలు వెలువడ్డాయి. స్పందించిన అటవీశాఖ సెక్షన్ అధికారి షాన్‌వాజ్, బీట్ అధికారి నాగేనాయక్ సిబ్బందితో ఆ ప్రాంతంలో బాణా సంచా కాలుస్తూ గస్తీ నిర్వహించారు. చిరుతల సంచారంపై ప్రజలు, రైతులు, కాపర్లను అడిగి తెలుసుకొన్నారు. కొండ పైభాగంలోకి వెళ్లి చిరుతల జాడలపై అన్వేషించారు.

తెగిన విద్యుత్తు తీగ.. తప్పిన ప్రమాదం



తెగి పడిన విద్యుత్తు తీగ, పక్కన మృతిచెందిన జీవాలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఉప్పొంక గ్రామంలోని ఎస్సీ కాలనీలో సోమవారం విద్యుత్తు తీగ తెగిపడింది. నివాసాల మధ్య పడటంతో గొర్రెల దొడ్డిలో ఉన్న నాలుగు జీవాలు మృతిచెందాయి. ఆ సమయంలో విద్యుత్తు సరఫరా ఉండడాన్ని గమనించిన యువకులు వెంటనే నియంత్రిక వద్దకు పరుగులు తీసి సరఫరాను నిలిపివేశారు. ఆట్రీట్ పాఠశాలకు విద్యార్థులు వెళ్తున్న సమయంలో తీగ తెగి ఉంటే ప్రాణాపాయం జరిగి ఉండేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనలో చెన్నమల్లకు చెందిన 3 పొట్టేళ్లు, ఒక మేకపోతు మృతిచెందాయి. పరిహారం అందేలా చూడాలని బాధితుడు వాపోయారు. కొత్తవి స్తంభాలు ఏర్పాటు చేసి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సంబంధిత అధికారులకు వెంటనే అక్కడికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు. ఈ విషయమై విద్యుత్తుశాఖ ఏడీ గురురాజ్‌ను వివరణ కోరగా వర్షాలు కురిసే సమయంలో మెరుపులు, పిడుగల శబ్దాలకు తీగ దెబ్బతినడంతో కిందకు పడి ఉంటుందన్నారు. మరమ్మతు చేయించి సరఫరాను పునరుద్ధరించామన్నారు.

దెబ్బతిన్న పంటలపై నివేదిక

బొమ్మనహాళ్: మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలపై నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు ఏవో సాయికుమార్ తెలిపారు. మండలంలో శనివారం 148.0 మి.మీ వర్షపాతం నమోదైన విషయం తెలిసిందే. ఆహార, వాణిజ్య, మిరప, పత్తి, ఉద్యాన పంటలు కలిపి 1400 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసి నివేదికను పంపామన్నారు. 1,100 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో పత్తి, 103 ఎకరాల్లో మిరప పంట దెబ్బతిన్నట్లు చెప్పారు. కొలగానహళ్లి, బందూరు, ఉద్దేహాళ్, లింగదహాళ్, ఉంతకల్లు, దేవగిరి తదితర గ్రామాల్లో పర్యటించి పంటల దుస్థితిని పరిశీలించారు.

పని చేయని సర్వర్.. ధ్రువపత్రాలకు అగచాట్లు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో జనన-మరణ ధ్రువపత్రాల కోసం ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. వారం రోజులుగా సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ సర్వర్ పనిచేయక పోవటంతో 26 దాకా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రాయదుర్గం సర్వజన ఆసుపత్రిలో అదే సర్వర్ పని చేస్తుండగా పురపాలక సంఘంలో మాత్రం సతాయిస్తుంది. రోజూ దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నేడు, రేపు అంటూ సంబంధిత విభాగానికి చెందిన హెల్త్ అసిస్టెంట్ జగదీశ్ చెబుతున్నారు. నిర్వహణ సమస్యలతో ఇబ్బందులు తలెత్తాయని ఆయన అంటున్నారు. సంబంధిత అధికారులు ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి దరఖాస్తుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నాలుగు రోజులుగా ప్రదక్షిణలు

మరణ ధ్రువపత్రం కోసం నాలుగు రోజులుగా ప్రదక్షిణలు చేస్తున్నా. నేడు-రేపు అంటూ తిప్పుతున్నారు. సర్వర్ పని చేసేలా చూడాలి.
లక్ష్మయ్యశెట్టి, రాయదుర్గం

జగజ్జననీ.. పాహిమాం



రాయదుర్గం: గౌరీ దేవి అలంకారంలో వాసవీమాత



రాయదుర్గం: ప్రత్యేకాలంకరణలో మహాంకాళిదేవి



రాయదుర్గం పట్టణం: మహాలక్ష్మీదేవి



కణేకల్లు: గాయత్రీదేవిగా వాసవీమాత



కణేకల్లులో..



ఉరవకొండ: ధనలక్ష్మి రూపంలో ఉద్భవలక్ష్మి

దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఐదవ రోజు సోమవారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులు సందర్భంగా అమ్మవార్లను వివిధ రూపాల్లో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు, హోమాలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. నవరాత్రులతో అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా కనిపించాయి.
- న్యూస్‌టుడే, బృందం



ఉరవకొండ: మహా చండీ రూపంలో ఈశ్వరమ్మదేవి



ఉరవకొండలో..



కళ్యాణదుర్గం గ్రామీణం: అన్నపూర్ణదేవిగా మల్లిపల్లి చౌడేశ్వరిదేవి



బొమ్మనహాళ్: కొలగానహళ్లిలో..

ద్విచక్ర వాహనం చోరీ

ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు బాధితుడు సుంకేనాయక్ వాపోయారు. ఆయన 108లో ఈఎంటీగా పని చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి వచ్చి, వాహనాలను నిలిపే స్థలంలో ఉంచి విధులకు వెళ్లారు. విధులు ముగించుకుని సోమవారం ఉదయం పరిశీలించగా కనిపించలేదన్నారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫ్లెక్సీ ఏర్పాటుపై వాగ్వాదం

రాయదుర్గం పట్టణం: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని హోర్డింగ్‌పై ఫ్లెక్సీ ఏర్పాటుపై వాగ్వాదం చోటు చేసుకొంది. ఆదివారం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా కొందరు వైకాపా నాయకులు హోర్డింగ్‌కు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సోమవారం మధ్యాహ్నం అదే హోర్డింగ్‌కు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు సంబంధించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా పలువురు వైకాపా నాయకులు అడ్డుకున్నట్లు తెలిసింది. మున్సిపల్ అధికారులు ఇరువర్గాలకు సర్దిచెప్పి ఎమ్మెల్యే కాలవ ఫ్లెక్సీ వేయించడంతో వివాదం సద్దుమణిగింది.

మరమ్మతు పనులు వేగవంతం చేయండి

డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం): వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులను మరమ్మతు చర్యలు వేగవంతం చేయాలని కళ్యాణదుర్గం ఆర్డీవో వినూత్న పేర్కొన్నారు. సోమవారం డి.హీరేహాళ్ మండలం దొడగట్ట సమీపంలో వర్షానికి కుంగిన దారిని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది రాకుండా తాత్కాలికంగా దారులను మరమ్మతు చేయాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.



కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి ఆర్డీవో వినూత్న

ఫిర్యాదుపై కేసు నమోదు

వజ్రకరూరు: వృద్ధురాలిని కారు ఢీకొన్న ఘటనపై సోమవారం వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుళ్ రమేశ్ తెలిపారు. గంజికుంట అంకమ్మ అనే వృద్ధురాలు వజ్రకరూరులో దారి దాటుతుండగా కారు ఢీకొట్టడంతో గాయాలపాలై చికిత్స పొందుతున్నట్లు వివరించారు.

మద్యం దుకాణాలకు 21 దరఖాస్తులు

కణేకల్లు: కణేకల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ప్రైవేటు మద్యం దుకాణాలకు కణేకల్లు మండలంలో 4, బొమ్మనహాళ్ మండలంలో 2 దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 21 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ ఉమాభాయ్ పేర్కొన్నారు. ఈనెల 9న తుది గడువు అని ఆసక్తి ఉన్న వారు ముందుగానే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. లాటరీ తీసే సమయంలో మరో వ్యక్తి హాజరు కావొచ్చని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో ఆథరైజేషన్ పత్రాన్ని తప్పనిసరిగా అందజేయాలని సూచించారు.

గొల్ల వాటర్‌షెడ్ నూతన కమిటీ ఎంపిక



ఎంపికైన నూతన ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లతో అధికారులు, నాయకులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం గొల్ల వాటర్ షెడ్ ప్రాజెక్టు నూతన కమిటీ ఎంపికైంది. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాటర్‌షెడ్ ప్రాజెక్టు అధికారిణి శ్రీవిద్య, పంచాయతీ కార్యదర్శి హేమలత, తెదేపా మండల కన్వీనర్ వెంకటేశులు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఛైర్మన్‌గా బొజ్జన్న, వైస్ ఛైర్మన్‌గా లింగమయ్య, 9 మంది సభ్యులు ఎంపికయ్యారు. ప్రాజెక్టు పరిధిలో వచ్చే పనులు చేపట్టి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నూతన ఛైర్మన్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అభినందించారు. మాజీ సర్పంచి రామ్మోహన్‌యాదవ్, నాయకులు రమేశ్, వాటర్ షెడ్ ప్రాజెక్టు సిబ్బంది శేషు, ఈరణ్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

కేంద్రం ఇలా.. భద్రత ఎలా

మండల కేంద్రంలోని దర్గావీధిలోని అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో అపరిశుభ్రత నెలకొంది. విషపు పురుగులు సంచరిస్తుండటంతో చిన్నారులను కేంద్రానికి పంపించడానికి తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే కేంద్రం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కుందుర్పి**



ఆటో బోల్తా: ఒకరి మృతి

కూడేరు (ఉరవకొండ): ఆటో బోల్తా పడి ఒకరు మృతిచెందిన ఘటన సోమవారం కూడేరు మండలంలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా.. కలగళ్ల గ్రామానికి చెందిన పెద్దన్న (60) పండగ సంత కోసం ఆటోలో కూడేరుకు వస్తున్నాడు. అంతరగంగ సమీపంలో ఆటో బోల్తాపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వివాహిత..

కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామంలో శిరీష (21) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ పలుచోట్ల వైద్యసేవలు పొందిన నొప్పి తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఈశ్వరయ్య పేర్కొన్నారు.

నిఘానేత్రాన్ని కప్పేసిన తీగలు

సంఘటనలు, నేర విభాగాల్లో నిఘానేత్రాలు ప్రధాన భూమికగా నిలుస్తున్నాయి. అలాంటిది ఓ చెట్టుతీగ అల్లుకొని నిఘానేత్రం కనిపించకుండా పోయింది. ఈ దృశ్యం కళ్యాణదుర్గం పట్టణంలోని గ్రామీణ పోలీసుస్టేషన్‌కు వెళ్లే మార్గం వద్ద దర్శనమిస్తోంది. ఆ ప్రాంతంలో అనుకోకుండా ఏవైనా నేరాలు జరిగాయంటే వివరాలు తెలుసుకొనేందుకు ఇబ్బందులు పడాల్సిందే. చెట్టు తీగను తొలగించి నిఘానేత్రాన్ని సక్రమంగా వినియోగంలోకి తీసుకొచ్చేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులకు ఎంతైనా ఉంది. ఈ విషయమై ఆ శాఖ అధికారులను వివరణ కోరగా ఒకరిపై ఒకరు చెప్పుకోవడం గమనార్హం. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**



నకిలీ బంగారం ముఠా అరెస్టు

ఎదులాపురం, న్యూస్‌టుడే: అసలైన బంగారంలా నమ్మించి నకిలీ బంగారాన్ని అంటగట్టి మోసం చేసే ముఠాలోని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ సునిల్‌కుమార్‌తో కలిసి ఆయన సోమవారం మాట్లాడుతూ అనంతపూర్ జిల్లా కనగల్లు మండలం కూడేరు మండలం కలగళ్ల గ్రామానికి చెందిన ఈ.నాగరాజు, కర్నూల్‌కు చెందిన దేవర తిమ్మరాజు, ఈ.సుధాకర్, గోపాల్, కారు డ్రైవర్ ప్రవీణ్(బళ్లారి-కర్ణాటక)కు చెందిన అయిదుగురు ముఠాగా ఏర్పడి వ్యాపారులకు నకిలీ బంగారం చూయించి అసలైనదిగా నమ్మించి మోసం చేస్తుంటారని పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని రాధాకృష్ణ లాడ్జిలోకి ఈ.నాగరాజు, దేవర తిమ్మరాజులు వెళ్లి అక్కడ ఉన్న రిసెప్షనిస్ట్‌తో తమకు గది కావాలని చెప్పి పైనున్న గదిలోకి అతడిని తీసుకెళ్లారు. వెంటనే రెండో బ్యాచ్‌లోని ఇద్దరు కౌంటర్ వద్దకు చేరుకొని నగదు చోరీ చేసేందుకు ప్రయత్నించగా అది తెరుచుకోలేదు. దీంతో అక్కడున్న విజిటర్స్ దస్త్రాలను తస్కరించి తీసుకెళ్లారు. అనంతరం మొదటి బ్యాచ్ వారు తమకు గది నచ్చలేదని వెళ్లిపోయారు. రిసెప్షనిస్ట్ కౌంటర్ వద్దకు వచ్చి చూడగా విజిటర్స్ పుస్తకాలు కనబడకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు సోమవారం ఈ.నాగరాజు, దేవర తిమ్మరాజును పట్టుకుని అరెస్టు చేశారు.

రూ. కోట్లు వెచ్చించారు.. ప్రారంభం మరిచారు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారింది. 2019లో తెదేపా ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసింది. తర్వాత అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం దర్గాహొన్నూరులో రూ.1.50 కోట్లతో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించింది. భవనం పూర్తవక ముందే ఇద్దరు వైద్యులు, స్టాఫ్‌నర్సు, ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మాసిస్టు తదితర సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. ఇంతవరకు ప్రారంభం చేయలేదు. ప్రస్తుతం గ్రామంలోని విలేజ్ క్లీనిక్‌లో వైద్య సేవలందిస్తున్నారు. రోగులకు ఓపీ నిర్వహించడానికి కూడా స్థలం లేదు. రోజు వంద మంది వరకు రోగులు వస్తుంటారు. రోగులు విశ్రాంతి తీసుకోవడానికి బెడ్లు కూడా లేవు. దీంతో గర్భిణులు కాన్పుల కోసం ఉరవకొండ, కర్ణాటకలోని రూపన గుడికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రాత్రిళ్లు దర్గాహొన్నూరుకు అత్యవసర వాహనాలు రావాలన్నా సకాలంలో రాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై వైద్యాధికారి రఫియా సుల్తానాను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.



దర్గాహొన్నూరులో నిరుపయోగాంగా మారిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు

రాయదుర్గం: పట్టణ తెదేపా నాయకుడు పొరాళు పురుషోత్తం రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సోమవారం విజయవాడ బీసీ సంక్షేమ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్యక్షుడు నందం అబద్ధయ్యను సన్మానించారు.

అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శాంతినగర్‌లో వైఎస్ఆర్ విగ్రహం వెనుక ఉన్న ప్రాంతాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. సోమవారం సాయంత్రం స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు మట్టిని చదును చేస్తున్న పొక్లెయిన్‌ను కార్యాలయానికి తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ నాగరాజును వివరణ కోరగా ప్రైవేటు వ్యక్తులు తమ స్థలంలో తాము పనులు చేస్తున్నామని చెబుతున్నారు. దస్త్రాలు పరిశీలించి, స్థలాన్ని సర్వే చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

మడుగుల వీధి.. నడిచే దారేదీ?

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఇళ్ల ముందు సిమెంటు దారిపై నిలిచిన నీటితో ఆ కాలనీవాసులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. మండలంలోని నింబగల్లు బీసీ కాలనీలోని ఓ వీధిలో ఇళ్ల ముందు నీరు నిలిచాయి. చిన్నపాటి వర్షం పడినా ఆ వీధి కాలువలా మారుతోంది. కొందరు సిమెంటు దారిపై ఎత్తుగా మట్టిని వేసుకోవడంతో నీరు ముందుకు కదలడం లేదు. వృద్ధులు, మహిళలు కింద పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. వారు ఇంటి నుంచి బయటికి రావాలన్నా కష్టంగా ఉంది. నీటి నిల్వ దోమల ఉత్పత్తికి ఆవాసంగా మారుతోంది. గత ఐదేళ్లుగా ఇలాంటి ఇబ్బందినే ఎదుర్కొంటున్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ దృష్టికి తీసుకెళ్లగా నీరు ముందుకు పోయేలా చర్యలు తీసుకుంటామన్నారు.



ఇళ్ల ముందు సిమెంటు దారిపై నిలిచిన నీరు

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

మున్సిపల్ కమిషనర్‌గా నయీమ్ అహమ్మద్



గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌గా నయీమ్ అహమ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ వెంకటరమణయ్య నంద్యాలకు బదిలీ అయ్యారు. కొత్త కమిషనర్ విజయవాడలోని మున్సిపల్ డైరెక్టరు కార్యాలయం నుంచి గుంతకల్లుకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి అందరం కలిసి చక్కగా విధులను నిర్వహిద్దామని వారికి తెలియజేశారు. బదిలీపై వచ్చిన మున్సిపల్ ఇంజినీరు లీలాకృష్ణ ప్రసాద్, సహాయ సిటీ ప్లానర్‌గా శ్రీనివాసులు కూడా బాధ్యతలు చేపట్టారు.

ఆర్డీఓపై చర్యలకు డిమాండ్

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు రైల్వే డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో సభ్యులను నియామకంలో నిబంధనలను పాటించని వెల్లిన ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డిపై చర్యలు తీసుకోవాలని దళితసంఘాల నాయకులు డిమాండు చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించి ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. కమిటీలో బీసీలను నియమించడం చట్టవ్యతిరేకమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు రామాంజనేయులు, కోరి చంద్రశేఖర్, భీమలింగ, వెంకటేశ్, నరసింహులు, మహేంద్ర, రవి పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

యాడికి : మండలంలోని రాయలచెరువు పంచాయతీలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యుడు సూర్యనారాయణ, సూర్యనారాయణ, సత్యనారాయణ, కులశేఖర్, రామక్రిష్ణ, ఈస్మాయిల్, మంజునాథ్ పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : గుంతకల్లు డీఎల్‌డీఓగా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంతకల్లు డివిజన్ ఏర్పాటవ్వడంతో డీఎల్‌డీఓను నియమించారు. డ్వామాలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆమెను నియమించారు. డీఎల్‌డీఓకు ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది శుభకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.



విజయలక్ష్మి

పుట్లూరు : పుట్లూరు సీఐగా సత్యబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడి సీఐ సుబ్రహ్మణ్యం వీఆర్‌లో ఉంచారు. సీఐ సత్యబాబు పోలీసులతో పరిచయం చేసుకుని తాజా పరిస్థితులపై ఆరా తీశారు.

యల్లనూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్‌డీగా మనోహర్ బాబు, ఏఓగా వాసుదేవరెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. సోమవారం కొర్రపాడు ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన ఆసుపత్రి సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యశాలలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మోహన్ బాబు, పర్వీన్, శ్రీధర్, రామచంద్ర, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

శింగనమల, న్యూస్‌టుడే : వరద బాధితులను ఆదుకునేందుకు శింగనమల మండలం సోదనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సేకరించిన విరాళాలు రూ.10 వేలను సోమవారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందజేశారు. జిల్లా కలెక్టర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించినట్లు ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు.

పేదింటి బిడ్డ.. క్రీడల్లో దిట్ట

సెపక్ తక్రాలో రాణిస్తున్న మానస

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : వజ్రకరూరు కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఎంఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మానస సెపక్‌తక్రా క్రీడలో పతకాలు సాధిస్తూ సత్తా చాటుతోంది. బాలిక అటు చదువుతోపాటు.. ఇటు క్రీడల్లోనూ రాణిస్తూ అందరిచేత శెభాష్ అని ప్రశంసతలు అందుకుంటోంది. గుంతకల్లు సత్యనారాయణపేటకు చెందిన మానస తల్లిదండ్రులు రామాంజనేయులు, లలితకుమారి రజక వృత్తితో జీవనం సాగిస్తున్నారు. వారు తమ కుమార్తెను చదివిస్తూ క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల స్థాయిలో సెపక్‌తక్రా క్రీడ నేర్చుకున్న ఆ బాలిక 2018-19లో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో, 2020, 2021లో గోవాలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. ఈ ఏడాది మార్చిలో కర్ణాటక రాష్ట్రం దావణగెరెలో జరిగిన జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీల్లోనూ ప్రతిభ కనబరిచింది. జట్టు ద్వితీయ స్థానం నిలిచింది.



సాధన చేస్తున్న మానస

● అక్టోబరు మొదటి వారంలో గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో రెండు రోజుల పాటు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలు జరిగాయి. అనంతపురం బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. జట్టు సభ్యులు మానస, రమ్య, చైత్ర ప్రతిభ కనబరచడంతో జట్టు విజయం సాధించింది. దీంతో మానస జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 20న నాగాలాండ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో బాలిక పాల్గొననుంది.



పతకాలతో..

ఆర్మీలో మేజర్ కావాలనేది లక్ష్యం

సెపక్‌తక్రా ఆట అంటే చాలా ఇష్టం. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నా. త్వరలో జరిగే జాతీయ స్థాయి ఆటలో సత్తా చాటాలని సాధన చేస్తున్నా. ఆర్మీలో మేజర్ కావాలనేది నా లక్ష్యం. సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని ఉంది.

- మానస, గుంతకల్లు పట్టణం.



నార్పల రహదారిని ఆక్రమించి ర్యాంపు ఏర్పాటు చేస్తున్నారిలా..

స్థలాన్ని ఆక్రమించి.. ర్యాంపు నిర్మించి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : అనంతపురం నుంచి నార్పల వెళ్లే ప్రధాన రహదారిని రేకులకుంటలో వైకాపా నాయకుడు ఆక్రమించి ర్యాంపు ఏర్పాటు చేసుకున్నాడు. నార్పల వెళ్లే రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. రేకులకుంటలో రహదారి పక్కనే నూతన ఇంటిని నిర్మించుకుంటున్న వైకాపా నాయకుడొకరు ప్రధాన రహదారి వరకూ ఉన్న ఖాళీ స్థలాన్ని సిమెంటుతో ర్యాంపు ఏర్పాటు చేసి ఆక్రమించారు. రాత్రి సమయంలో వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయంలో ఈ ప్రదేశంలో వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య : గుంతకల్లు తిలక్‌నగర్‌లో కమల్‌సాబ్ వీధిలో దోమల బెడద అధికంగా ఉంది. పిల్లలు, పెద్దలు దోమ కాటతో జ్వరాలబారిన పడుతున్నారు. **- రవి, స్థానికుడు**

సమాధానం : దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. **- వీరేశ్, కార్యదర్శి, 15వ సచివాలయం**

- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సమస్య : బుక్కరాయసముద్రంలోని జనచైతన్యకాలనీలో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. అవి వెలిగేలా చర్యలు తీసుకోవాలి. **- షేక్ జిగ్ను, జనచైతన్యకాలనీ**

సమాధానం : వెంటనే వీధి దీపాలు బాగు చేయించి ప్రజలు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. **- రేవతి, కార్యదర్శి, సచివాలయం-5**

- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

వైద్యుల కొరత తీర్చండి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని, వైద్యులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను వైద్యాధికారి ఎల్లప్ప కోరారు. వైద్యుల కొరత వల్ల రోగులకు మెరుగైన సేవలందించలేకపోతున్నట్లు వివరించారు. సోమవారం ఆరోగ్యశాఖ ఆరాధ్యదైవమైన సునామ జకీ మాత ఆలయంలో భోజన వసతి గృహాల నిర్మాణానికి ఎంపీ భూమిపూజ చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షలు నిధులిస్తామని ఎంపీ పేర్కొన్నారు. అనంతరం ఆయన ఆసుపత్రిని సందర్శించి వైద్యులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, నాయకుడు కృష్ణయ్య పాల్గొన్నారు.



ఆసుపత్రిలోని సమస్యలను ఎంపీకి వివరిస్తున్న వైద్యాధికారి ఎల్లప్ప

రోడ్ల మరమ్మతుకు నిధులివ్వాలని వినతి

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు నియోజకవర్గంలో దెబ్బతిన్న ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతుకు నిధులు కేటాయించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేంద్రగౌడ్ రోడ్లు భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సోమవారం తాడేపల్లిలో మంత్రిని ఆయన, తెదేపా నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. నిర్మాణంలో ఉన్న రోడ్లను త్వరగా పూర్తి చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మాజీ మండలాధ్యక్షుడు వీరభద్రయ్య, రంగా, ఆంజనేయులు పాల్గొన్నారు.



మంత్రి జనార్దన్‌రెడ్డితో జితేంద్రగౌడ్

'తాడిపత్రిని ప్రగతి పథంలో నిలపడమే ధ్యేయం'

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే : తాడిపత్రి పట్టణాన్ని ప్రగతి పథంలో నిలపడమే ధ్యేయమని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రముఖులు, రియల్టర్లు, స్టాంప్ రైటర్లు, మునిపల్ రిజిస్టర్డ్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకున్నా నిర్మాణాలు చేపడితే మున్సిపాలిటీకి ఆదాయం తగ్గడంతోపాటు దాని ప్రభావం మౌలిక వసతులపై పడుతుందన్నారు. అందరం కలిసి నిబంధనలు పక్కాగా అమలు అయ్యేలా పనిచేసి తాడిపత్రి పట్టణాన్ని ప్రగతి పథంలో నిలుపుదామని చెప్పారు. దేశంలోనే ఆదర్శంగా ఉన్న పట్టణాన్ని గత వైకాపా ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేద్దామని తెలిపారు.

10 నుంచి చింతల వేంకటరమణుడి బ్రహ్మోత్సవాలు

తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే : తాడిపత్రిలో చింతల వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ నెల 10 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి బ్రహ్మోత్సవాలకు రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. రాజకీయాలకు అతీతంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, బ్రహ్మోత్సవాల ఆలయ కమిటీ అధ్యక్షుడు జలదుర్గం దామోదర్‌దాసు, సభ్యులు వెంకటశేషపాణి, అరవింద నారాయణరెడ్డి, చంద్రశేఖర్, వెంకటరంగయ్య పాల్గొన్నారు.



జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా

యాడికి, న్యూస్‌టుడే : చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం యాడికి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించి ధర్నా చేశారు. వ్యవసాయం అనంతరం రెండో స్థానంలో ఉన్న చేనేత పరిశ్రమపై ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం లేదని సీపీఐ రంగయ్య, కౌన్సిల్ సభ్యుడు వెంకటరాముడుయాదవ్ పేర్కొన్నారు. పట్టు చీరలు, ముడి సరకులపై జీఎస్టీ వేస్తున్న కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారని, అదేవిధంగా పవర్ లూమ్స్‌తో చేనేతకు తీవ్ర దెబ్బకొడుతోందన్నారు. కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడకుండా నేతన్ననేస్తం, ప్రత్యేక రుణాలు, ఉచిత విద్యుత్తు, ముడి సరకులకు రాయితీ ఇవ్వాలని కోరుతూ తహసీల్దారు ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో నాయకులు రఫీ, రాముడు, ఓబిరెడ్డి, శ్రీరాములు, శివన్న, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కార్మికుల వేతనాలు పెంచాలని ఆందోళన

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మండలంలోని గంజిగుంటపల్లి సమీపాన ఉన్న సౌరశక్తి ప్లాంటులో పని చేస్తున్న కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి అన్యాయం చేస్తున్నారని, వేతనాలు పెంచాలని కోరుతూ సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సౌరశక్తి ప్లాంటు వద్ద ఆందోళన చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కొండయ్య, రంగస్వామి, ఆదినారాయణ, కుమారస్వామి, చేనేత కార్మిక సంఘం నాయకులు చింతాపురుషోత్తం, రంగన్న, శ్రీరాములు, మారెప్ప, ఓబుళేసు, లాలెప్ప తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ఎస్ఐ చిన్నరెడ్డెప్ప బందోబస్తు ఏర్పాటు చేశారు.



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నిందితులను శిక్షించాలని బైఠాయింపు

పుట్లూరు, న్యూస్‌టుడే : వివాహితను నిర్దాక్షిణ్యంగా చంపి గుండెపోటుగా మార్చిన నిందితులను వెంటనే శిక్షించాలని కోరుతూ ఆమె కుటుంబ సభ్యులు సోమవారం పుట్లూరులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కడవకల్లులో నాలుగు నెలల కిందట వివాహిత చంద్రకళ అనుమానస్పదంగా మృతి చెందింది. అదే కాలనీలో నివాసం సిద్ధయ్య కారణమంటూ బాధితురాలి భర్త చిన్నన్నతోపాటు బంధువులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తుండటంతో వారు తాడిపత్రి - పులివెందుల ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనలు చేపట్టారు. ట్రాఫిక్ స్తంభించడంతో సీఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. వారితో మాట్లాడి కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



రోడ్డుపై బైఠాయించిన బాధితులు



గుంతకల్లు : మస్తాన్‌పేటలోని మారెమ్మ



గార్లదిన్నె గ్రామీణం : కల్లూరులో లలితా త్రిపుర సుందరీదేవిగా ..



పెద్దపప్పూరులో సంతానలక్ష్మిగా చౌడేశ్వరీదేవి



బుక్కరాయసముద్రం : పెద్దమ్మతల్లి



పెద్దవడుగూరు: క్రిష్టిపాడులో లలితాదేవిగా చౌడేశ్వరి



యాడికి: అన్నపూర్ణాదేవిగా వాసవీమాత



గుంతకల్లు పట్టణం : గాయత్రీదేవిగా కన్యకా పరమేశ్వరి

అమ్మ దర్శనం.. భక్తుల పరవశం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం గుంతకల్లు, శింగనమల, తాడిమపత్రి నియోజకవర్గాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. ఆలయాలు భక్తులతో సందడిగా కనిపించాయి. ఆలయాలు విద్యుత్తు కాంతులతో అలంకరించారు.

- న్యూస్‌టుడే, బృందం



గుంతకల్లు పట్టణం : మోహినీగా కొల్హాపురి మహాలక్ష్మి

రైల్వే ఉద్యోగుల ఖాతాకు బోనస్ జమ

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని 14,850 మంది సిబ్బంది ఖాతాల్లోకి దసరా బోనస్‌ను సోమవారం జమ చేసినట్లు సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణయించిన సమయం కంటే రెండు రోజుల ముందే ఉద్యోగులు, కార్మికులకు రూ.24.33 కోట్లు బోనస్ అందజేశారు. అకౌంట్స్, పర్సనల్ విభాగాల ఉద్యోగులను డీఆర్ఎం అభినందించారు.

అంజన్న సేవలో ఎమ్మెల్సీ

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎ.వి.రామచంద్రారెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణలు అనంతరం ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్సీకి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి - ఊబిచర్ల మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కె.ఊబిచర్ల నుంచి జయరాం ద్విచక్ర వాహనంలో గుత్తికి వస్తుండగా గుత్తి నుంచి ప్యాపిలికి వెళుతున్న మరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో జయరాంతోపాటు మరో వ్యక్తి గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భార్యాభర్తలకు..

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మండలంలోని అప్పేచెర్ల సమీపాన 67వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన భార్యాభర్తలైన దాదాఖలందర్, ఫాతిమా సొంత పనుల నిమిత్తం రాయలచెరువుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తాపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాలస్తీనాలో శాంతి నెలకొల్పాలి: సీపీఎం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : పాలస్తీనాపై జరుగుతున్న మారణహోమం ఆపి శాంతిని నెలకొల్పాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం గుంతకల్లులో శాంతి ప్రదర్శన నిర్వహించారు. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న బాంబుల దాడులకు 45 వేల మంది అమాయక ప్రజలు మరణించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గం సభ్యుడు డి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు మారుతి ప్రసాద్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

అడుగుకో గుంత.. చోదకుల చింత

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లులోని పోర్టర్‌లైన్ కాలనీవద్ద గుంతకల్లు - ఆదోని ఆర్అండ్‌బీ రహదారిపై పెద్దఎత్తున గుంతలు పడ్డాయి. ఈ మార్గం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. నిమిషానికి పది వాహనాలు వెళుతుంటాయి. గుంతల కారణంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నాయి. వర్షం పడిన సమయంలో ఈ గుంతల్లో పెద్దఎత్తున నీరు చేరతుండటంతో వాహన చోదకులు గుంతలను గమనించలేక ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇక్కడ శాశ్వత మరమ్మతులు చేయకపోతుండడంతో ఈ దుస్థితి ఏర్పడింది. రోడ్డుకు మరమ్మతులు చేసి తాము ప్రమాదానికి గురికాకుండా చూడాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ డీఈ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. ప్రయాణికులు, వాహన చోదకులు ప్రమాదాలబారిన పడుతకుండా చూస్తామన్నారు.



గుంతల రోడ్డులో కష్టంగా వెళుతున్న ఆటో

రైల్వే సీఐకు సత్కారం

గుంతకల్లు : రైల్వే ప్రయాణికురాలి బంగారు గొలుసును లాక్కుని ఆమెను రైలులో నుంచి కిందకు తోసివేసిన చోరులను వెంటనే పట్టుకుని అరెస్టు చేసి, రాష్ట్ర డీజీపీ నుంచి నగదు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్న గుంతకల్లు రైల్వే సీఐ నగేశ్‌బాబును సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు సత్కరించారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్, నాయకులు నాగప్ప, జయరాం, రాజేశ్, భారతి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో జూదం, మట్కా నిర్వహిస్తున్న ఐదుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పట్టణానికి చెందిన మాతంగి రాము మట్కా నిర్వహిస్తుండగా సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేశ్ అరెస్టు చేసి అతని నుంచి రూ.23,600 స్వాధీనం చేసుకున్నారు. శ్రీపురం, రజాపురం చెందిన నలుగురు జూదం ఆడుతుండగా అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18,500 స్వాధీనం చేసుకున్నారు.

తాడిపత్రి పట్టణం : గోసువారిపల్లి సమీపంలో జూదం ఆడుతున్న ఐదుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రూ.20,710ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

మూలకు చేరిన పరికరాలు

గుంతకల్లులో 3వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ ఆవరణలో చెత్త సేకరణ బండ్లు, పరికరాలు మూలకు వేశారు. బండ్ల చక్రాలు ఊడిపోయి దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతులకు నిధులు లేకపోవడంతో పక్కనపెట్టారు. అవి వానకు తడిచి, ఎండకు ఎండి తుప్పు పడుతున్నాయి. వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తే చెత్త సేకరణ సులభంగా, వేగంగా జరుగుతుందని పారిశుద్ధ్య సిబ్బంది పేర్కొంటున్నారు.

- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం,



అధికారులకు బురద పట్టదా?

కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయ కల్యాణ మండపం చుట్టూ బురద, చెత్తాచెదారం పేరుకున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునేవారు పడుతున్న అవస్థలు అంతా ఇంతాకాదు. బురదలోనే తిరగాల్సి వస్తోందని ఆలయ సందర్శకులు వాపోతున్నారు. ఆలయంలో పెద్దసంఖ్యలో సిబ్బంది ఉన్నా శుభ్రత చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఈ విషయాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి మల్లికార్జునను అడగ్గా వెంటనే బురద, చెత్తను తొలగింపజేసి భక్తులు ఇబ్బందులు పడకుండా చూస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, గుంతకల్లు



కంకర పరిచారు.. వదిలేశారు..

గుంతకల్లు మండలంలోని చింతలాంపల్లికి వెళ్లే దారిలో గుత్తేదారులు కంకర పరిచి రోడ్డు వేయడం మరిచారు. దీంతో కంకర దారిపై రాకపోకలు సాగించేందుకు గ్రామస్థులు ఇబ్బందులు పడతున్నారు. గ్రామంలోకి అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా వచ్చేందుకు వీలులేని విధంగా రోడ్డు ఉంది. సమస్యను మండల ఇంజినీరు ఓబులేశు దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే పనులు ప్రారంభించి రోడ్డు పూర్తి చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, గుంతకల్లు గ్రామీణం**



ఆర్టీసీ బస్టాండు కూల్చడంపై వివాదం

యాడికి, న్యూస్‌టుడే : యాడికిలోని వేములపాడు రోడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాండు భవనాన్ని తొలగించడంపై వివాదం ఏర్పడింది. ఎటువంటి ఉత్తర్వులు లేకుండా వైకాపా నాయకులు పొక్లెయిన్‌లతో సోమవారం కొంతమేర కూల్చారు. విషయాన్ని తెలుసుకున్న తెదేపా నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని కూల్చకుండా యంత్రాలను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వచ్చి పరిస్థితిపై ఆరా తీశారు. దీంతో ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ప్రభుత్వ ఆస్తులను నష్టం కలిగించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని తెదేపా నాయకులు తహసీల్దారు ప్రతాప్‌రెడ్డి, ఆర్టీసీ డీఎం శంకర్, సీఐ ఈరన్నకు వినతిపత్రాలను అందజేశారు. ఆర్టీసీ ఆస్తికి నష్టం కల్గించిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీఎం శంకర్ తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందచేస్తున్న తెదేపా నాయకులు

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

భద్రతా సిబ్బంది నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని టోల్ ప్లాజాల్లో ఖాళీగా ఉన్న సెక్యూరిటీ గార్డుల నియామకానికి మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప తెలిపారు. అనంతపురం జిల్లాలోని దర్గాహొన్నూరు, రొళ్ల, ఉమవణకుంట, కాశెపల్లి, బత్తలపల్లి సమీపంలోని టోల్‌ప్లాజాల్లో, గుత్తి సమీపంలోని బీవీఎస్‌లో సెక్యూరిటీ గార్డుల ఖాళీలను భర్తీ చేస్తారని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 08554-241146 నెంబరులో సంప్రదించాలని కోరారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే: గంగ: సత్యం సుందరం, **నాయకి:** రామ్ నగర్ బన్నీ, **గౌతమి:** కలి, మిస్టర్ సెల్లిబ్రిటీ, **గౌరి,** **త్రివేణి,** **ఎస్వీ సినిమాక్స్,** **నీలిమ:** దేవర, **తరంగిణి:** దక్షిణ, **తేజస్విని:** స్వాగ్.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ఉమానగర్(అనంతపురం) న్యూస్‌టుడే: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని డీసీసీ అధ్యక్షుడు మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. నిరంతరం శ్రమిస్తున్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ నిర్మాణానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యకర్తలను చైతన్యపరచాలని సూచించారు. ఈ సమావేశంలో మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాకే శంకర్, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుణ: 9989195979, ఎస్పీ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: పాతూరు ఆసారవీధిలో చిన్న వర్షానికే నీళ్లు, మురుగు నిల్వ చేరుతున్నాయి. **- పుష్పరాజ్**

సమాధానం: శుభ్రం చేయిస్తాం

సమస్య: గుల్జార్‌పేట లిటిల్‌ఫ్లవర్ పాఠశాల సమీపంలో వీధి దీపాలు వెలగడం లేదు. **- మారుతికుమార్**

సమాధానం: లైట్లు వెలిగేలా చర్యలు చేపడతాం. (పై ప్రశ్నలకు నగరపాలక ఈఈ దక్షిణామూర్తి, ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు చెప్పారు.) **- న్యూస్‌టుడే, అనంత నగరపాలక**

సమస్య: ఆత్మకూరులోని భగత్‌సింగ్ కాలనీలో కుళాయి విరిగిపోయి నీరు వృథాగా పోతోంది. ఆ ప్రాంతం మురుగుమయం అయ్యింది. కుళాయికి మరమ్మతులు చేయించాలి. **- రాము, ఆత్మకూరు**

సమాధానం: మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికడతాం. **- చంద్ర, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, ఆత్మకూరు**



కాలువలో పేరుకుపోయిన మురుగు



దెబ్బతిన్న కల్వర్టు

డివిజన్:	జనాభా:	నివాస గృహాలు:	ఓటర్లు:	దుకాణాలు:
15	6 వేలు	4 వేలు	4,500	సుమారు 2 వేలు

కమలానగర్.. సమస్యలతో బేజార్

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: నగరంలోని కమలానగర్ వ్యాపారానికి కేంద్ర బిందువు. ఇక్కడ వేల సంఖ్యలో దుకాణాలు ఉన్నాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అన్ని రకాల వస్తువులు దొరుకుతాయి. నిత్యం జన సంచారంతో కిటకిటలాడుతుంది. అలాంటి ప్రాంతంలో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. ఏ వీధిలో చూసినా చెత్తా చెదారం, మురుగు పేరుకుపోయిన కాలువలు, దెబ్బతిన్న కల్వర్టులు కనిపిస్తున్నాయి. ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతోంది. సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారు. నగరపాలక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్పొరేటర్ ఇటువైపే రావడం లేదు

15వ డివిజన్ వైకాపా కార్పొరేటర్ ఎన్నికల ముందు ఓట్ల కోసం వచ్చారు. ఆ తర్వాత ఇటువైపే రావడం లేదు. సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నా.. కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఓట్లు కావాలి.. కానీ ప్రజా సమస్యలు పట్టవు. ఇప్పటికైన సమస్యలు పరిష్కరించాలి. **- గోపాల్, స్థానికుడు**



ఇవీ సమస్యలు

ఆర్ట్స్ కళాశాల మహిళా వసతి గృహం నుంచి మార్కెట్, రఘువీర టవర్స్, డీఈఓ కార్యాలయం, నిర్మలాశ్రమం, ఆర్‌ఎఫ్ రోడ్డు ఇలా అనేక ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. నిత్యం కాలువలు శుభ్రం చేయడం లేదు. నెలల తరబడి మురుగు నిల్వ చేరి దుర్వాసన వస్తుంది. చాలాచోట్ల కల్వర్టులు దెబ్బతిని, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దోమల వ్యాప్తితో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమలానగర్‌లో పెద్ద ఎత్తున దుస్తుల దుకాణాలు ఉండటంతో యువత కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. వాహనాల రద్దీతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని ఇటీవల 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా కాలనీలో పర్యటించిన ఆయనకు ప్రజలు పలు సమస్యలు విన్నవించారు. నగరపాలక అధికారులు పర్యటించి, కాలనీలో సౌకర్యాలు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మాటాడుతున్న ఎంపీడీవో లక్ష్మీనరసింహ

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని ఎంపీడీవో లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని గ్రామాల్లో పంటల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఉద్యాన పంటలు సాగు, గట్లపై మొక్కలు పెంచడంపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో సుజాత, ఈసీ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



బిక్కి కృష్ణకు జ్ఞాపికను అందజేస్తున్న అతిథులు

బిక్కి కృష్ణకు సాహిత్య సేవా యశోభూషణ బిరుదు

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన కవి, విమర్శకులు కళారత్న డాక్టర్ బిక్కికృష్ణకు సాహిత్య సేవా యశోభూషణ బిరుదు ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి విశ్వ పుత్రిక గజల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతోపాటు రూ. 50వేల నగదు పురస్కారం అందజేశారు. ఆయన పలు పుస్తకాలు రచించడంతో పాటు సాహిత్య సేవకు ఎనలేని సేవ చేశారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, ప్రముఖ వాగ్గేయ కారులు గోరేటి వెంకన్న, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత కమిషనరు నరసింహప్ప, విజయలక్ష్మి పండిట్ తదితరులు పాల్గొన్నారు.



శిథిల గదిలో భయంగా విధులు

అటవీశాఖ అనంతపురం రేంజీ కార్యాలయం పాత భవనంలో అధికారులు, సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. రేంజీ అధికారి ఛాంబర్ ముందు భాగం గదిలో పైకప్పు మొత్తం పెచ్చులూడి కడ్డీలు బయటపడ్డాయి. ఎప్పుడు.. ఎక్కడ పెచ్చులూడి మీదపడతాయోనని సిబ్బంది వణికిపోతున్నారు. రేంజీ అధికారి కార్యాలయ భవనం పైభాగంలో సామాజిక వన విభాగం కార్యాలయం ఉంది. రెండు కార్యాలయ అధికారులు, ఉద్యోగులంతా నిత్యం భయం.. భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని అనంతపురం డివిజన్ రేంజ్ అధికారి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా పైకప్పునకు మరమ్మతులు చేయిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, అనంతపురం(వ్యవసాయం)

సమన్వయంతో పని చేద్దాం



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్‌తో మాట్లాడుతున్న అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే: సమన్వయంతో కలిసికట్టుగా పని చేద్దామని అనంతపురం జిల్లా తెదేపా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ అన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మనస్పర్థలతో దూరంగా ఉంటున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న జిల్లా అధ్యక్షుడు సోమవారం వారిద్దరిని పార్టీ కార్యాలయానికి పిలిపించి తేనేటి విందు ఇచ్చారు. సుమారు గంటపాటు చర్చలు సాగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజలు ఏకపక్షంగా తెదేపాకు పట్టం కట్టారని, దాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ ముందుకు సాగాలని ఆయన సూచించినట్లు తెలిసింది.

పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి

అనంతపురం(వ్యవసాయం): అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోమవారం రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్‌ను కర్నూలులో కలిశారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రికి విన్నవించారు. పలు సమస్యలపై చర్చించామని ఎంపీ తెలిపారు.

రైల్వే ఉద్యోగుల ఖాతాకు బోనస్ జమ

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని 14,850 మంది సిబ్బంది ఖాతాల్లోకి దసరా బోనస్‌ను సోమవారం జమ చేసినట్లు సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణయించిన సమయం కంటే రెండు రోజుల ముందే ఉద్యోగులు, కార్మికులకు రూ. 24.33 కోట్లు బోనస్ అందజేశారు. అకౌంట్స్, పర్సనల్ విభాగాల ఉద్యోగులను డీఆర్ఎం అభినందించారు.

త్వరలో భూగర్భ మురుగుకాలువ పనుల ప్రారంభం

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే: నగరంలో త్వరలో భూగర్భ మురుగు కాలువ పనులు ప్రారంభిస్తాం. ఇప్పటికే అందుకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేశామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఆయన కమలానగర్ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులతో కలిసి వీధుల్లో పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పారిశుద్ధ్యంపై ఎక్కువగా సమస్యలు వస్తున్నాయని, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని 50 డివిజన్లతోపాటు అనంతపురం గ్రామీణంలోని నాలుగు పంచాయతీల్లోనూ మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎన్నికల ముందు పలు సమస్యలు గుర్తించామని, ఇంకా ఏమైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



కమలానగర్‌లో మార్కెట్ వద్ద మురుగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు

ఎటు చూసినా ప్లాస్టిక్ కుప్పలే..

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు మండలంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కుప్పలు దర్శనమిస్తున్నాయి. మండలంలో 17 పంచాయతీలు, 25 గ్రామాలు ఉన్నాయి. ప్రజలు ప్లాస్టిక్‌ను ఇబ్బడిముబ్బడిగా వినియోగిస్తున్నారు. అందుకు రోడ్లపక్కన కనిపించే కవర్ల దిబ్బలే నిదర్శనం. పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి నిత్యం వందల మంది భక్తులు వస్తుంటారు. ఇక్కడి హోటళ్ల యజమానులు ప్లాస్టిక్ కవర్లను ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. అవి రోడ్లపక్కన గుట్టలుగా పేరుకుపోతున్నాయి. అపరిశుభ్రత నెలకొనడంతో భక్తులు ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి. బి.యాలేరు గ్రామంలో హోటళ్లలోని ప్లాస్టిక్ వ్యర్థాలను సమీపంలోని చెరువు కట్ట వద్ద వేస్తున్నారు. అవి చెరువులోకి చేరి నీరు కలుషితం అవుతుంది. ఈ నీటినే పశువులకు, పంటల సాగుకు వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయించే వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీనిపై ఎంపీడీఓ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తాం. హోటళ్ల యజమానులు వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను ఎక్కడపడితే అక్కడ వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



బి.యాలేరు చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలు



పంపనూరు ప్రధాన రహదారి పేరుకుపోయిన కవర్లు

మట్కా నిర్వాహకుల అరెస్ట్


అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: నగరంలోని ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడు మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు. వారి నుంచి రూ. 70,450 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆన్‌లైన్ గేమ్‌లతో జీవితం నాశనం

అనంతపురం(గుల్జార్‌పేట), న్యూస్‌టుడే: ఆన్‌లైన్ గేమ్‌లు ఆడితే జీవితాలు నాశనం అవుతాయని పోలీసులు అన్నారు. ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతున్న యువత, బాలురకు అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. సోమవారం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని టీ కేఫ్‌లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అక్కడున్న యువత, బాలురు సెల్‌ఫోన్లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడటాన్ని గమనించారు. వాటి వల్ల కలిగే నష్టాలను వివరిస్తూనే.. దూరంగా ఉండాలని సూచించారు.

యువకుడిపై పోక్సో కేసు

అనంతపురం(బళ్లారిరోడ్డు), న్యూస్‌టుడే: నగర శివారులోని ఓ కాలనీలో ఏడేళ్ల చిన్నారిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన రవీంద్రపై పోక్సో కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపామన్నారు.



శివకోటిలో లలితాదేవి అలంకారం



ఉమానగర్‌లో రేణుకా యల్లమ్మ



సూర్యనగర్‌లో మల్లాలమ్మకు లలితాదేవి అలంకారం



కొత్తూరు అమ్మవారిశాలలో..

జయములివ్వు జగన్మాత

శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఐదోరోజు సోమవారం నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పలు రూపాల్లో కొలువుదీరిన అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న వైకుంఠ వాసున్ని గరుడ వాహనంలో ఊరేగించారు. శ్రీనృత్య కళా నిలయం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు జరిగాయి. బాలికలు అద్భుతంగా నృత్యాలు చేసి ప్రశంసలు అందుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి అనంత్, కోశాధికారి జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం



హెచ్చెల్సీ కాలనీలో..



నీరుగంటి వీధిలో..



శ్రీవేద గాయత్రీదేవీ ఆలయంలో..

కల్లుగీత సంఘాలకే మద్యం దుకాణాలు ఇవ్వాలి

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన పది శాతం మద్యం దుకాణాలను కేవలం కల్లుగీత సొసైటీల్లో ఉన్న కార్మికులకే కేటాయించాలని ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం కల్లుగీత కార్మికులతో కలిసి కలెక్టరేట్ రెవెన్యూ భవన్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిని కలెక్టర్‌కు అందజేశారు. ఈ నిరసనలో ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతులయ్య, కార్యదర్శి సీవీ హరికృష్ణ, ఉపాధ్యక్షుడు నాగప్ప, నగర అధ్యక్షుడు గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ భవన్ ముందు కల్లుగీత కార్మికుల నిరసన



మేయర్ వసీంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఈ భాస్కర్‌రావు

మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెరగాలి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఇంజినీరింగ్ విభాగం కీలకం అని, పనులు వేగంగా చేపట్టాలని మేయర్ వసీం సూచించారు. సోమవారం నగరపాలక ఎస్ఈ భాస్కర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మేయర్, కమిషనరు నాగరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. నగరపాలక ఏఈగా రాజశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల ధర్నా

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: వేతన, పీఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం వారు జడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. కార్మికులకు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. వేతన, పీఎఫ్ బకాయిలు చాలా నెలల నుంచి పేరుకుపోయాయని, కనీసం దసరా పండగకైనా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. గుత్తేదారులకు బకాయిలు చెల్లించామని జడ్పీ ఛైర్‌పర్సన్ బి.గిరిజమ్మ చెబుతున్నారని, కార్మికుల ఖాతాలకు మాత్రం ఇంకా జమ కాలేదన్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ దృష్టికి తీసుకెళ్తానని లక్ష్మణరావు హామీ ఇచ్చారు. కార్మికులు గత 32 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి, అధికారులకు చీమకుట్టినట్లయినా లేదని ఓబులు విమర్శించారు. జీతాలు ఇవ్వకపోతే సమ్మె విరమించరని హెచ్చరించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నాగముని, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి, కార్యదర్శి రాము, సభ్యులు ప్రభాకర్, నాగేంద్ర, వన్నూరుస్వామి, సోమశేఖర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మకు వినతిపత్రం అందించారు.



జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

తపోవనం(అనంత గ్రామీణం): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి పడేలా సమస్యలు పరిష్కరిస్తేనే సార్థకత ఉంటుందన్నారు. సోమవారం అనంతపురం అర్బన్, గ్రామీణ మండలాలకు ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను డీఆర్‌డీఏలో నిర్వహించారు. గత వారం వచ్చిన సమస్యలే మరికొన్ని అధికారుల దృష్టికి వచ్చాయి. జేసీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిష్కారానికి నోచుకోని సమస్యలపై కారణాలు చూపించి, వివరణ రాయాలని ఆదేశించారు. మొత్తం 40 అర్జీలు రాగా.. అందులో సగానికిపైగా భూముల సమస్యలపైనే ఉన్నాయి. కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ వసంతబాబు, తహశీల్దారు హరికుమార్, ఎంపీడీఓ దివాకర్, వ్యవసాయాధికారి శశికళ, ఎంఈఓ వెంకటస్వామి పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న జేసీ, ఆర్డీఓ

అయ్యా.. మొర ఆలకించండి

● కురుగుంట గ్రామానికి చెందిన లలితమ్మ తన భర్త మారెన్నకు రూ. 15వేలు పింఛను ఇవ్వాలని ఆటోలో తీసుకొచ్చారు. ఆయనకు దివ్యాంగ పింఛను రూ. 6వేల వస్తోందని, మంచానికే పరిమితం కావడం వల్ల పింఛను మొత్తాన్ని పెంచాలని ఆమె కోరారు. దీనిపై పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

● గ్రామీణ మండలం ఉప్పరపల్లి గ్రామంలో 17వ సర్వే నెంబరులోని అందరి పొలాలను ఫ్రీహోల్డ్ చేశారని, కేవలం 17-2ఎఫ్‌లో ఉన్న 2.40 ఎకరాల భూమిని నిషేధిత జాబితా కింద ఉంచారని నీలం ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రెవెన్యూ అధికారులు బినామీ పేర్లతో కొనుగోలు చేయడం వల్లే ఈ సర్వే నెంబరులోని అన్ని భూములను ఫ్రీహోల్డ్ కింద చేశారని ఫిర్యాదు చేశారు. ● 16వ సర్వే నెంబరులో ఉన్న విశ్వేశ్వరయ్య భూమికి దారి లేకుండా చేశారని వాపోయారు. కొబ్బరిబొండాం వ్యాపారులకు ఇచ్చిన ఇంటి పట్టాల సమస్య తీర్చాలని వ్యాపార సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉత్తన్న మరోసారి ఫిర్యాదు చేశారు. వారంలోగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దారు మోహన్‌కుమార్ హామీ ఇచ్చారు.

అర్హులకు పింఛను అందించాలి

కనగానపల్లి, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కదిరప్ప కోరారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపీడీఓ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాలు చూపుతూ పలువురు లబ్ధిదారులకు పింఛను ఇవ్వకుండా నిలిపివేశారని వారు ఆరోపించారు. పరిశీలించి, వారందరికీ పింఛన్లు అందజేయాలని కోరారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ

కనగానపల్లి: కనగానపల్లి ఎస్సైగా ఇసాక్‌బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బందితోపాటు ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

పాపంపేట.. ఆక్రమణల బాట



రోడ్డు మధ్యలో నిర్మించిన పార్కింగ్ దిమ్మె

అనంతపురం గ్రామీణ మండలం పాపంపేట జడ్పీ పాఠశాల సమీపంలో రహదారుల ఆక్రమణలకు అంతే లేకుండాపోతోంది. ఓ ప్రబుద్ధుడు రోడ్డును దర్జాగా ఆక్రమించి కారు పార్కింగ్ కోసం దిమ్మె నిర్మించుకున్నాడు. ఈ కారణంగా పొరుగున ఉన్నవారి ఇళ్లలోకి వర్షం నీరు చేరుతుంది. మరికొందరు ఇళ్లలోకి వరద నీరు రాకుండా రోడ్డుపై రాళ్లు అడ్డంగా పెట్టారు. దీంతో రహదారి రూపం కోల్పోయింది. ఇంకొందరు ఏకంగా మెట్లను రోడ్డును ఆక్రమించి కట్టుకున్నారు. వర్షం కురిస్తే నీరు ఉత్తరం దిశగా వెళ్లడానికి అవకాశం లేదు. దక్షిణం వైపునకు ప్రవహించడానికి ఆక్రమణలు అడ్డంకిగా మారాయి. దాంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆక్రమణలు తొలగిస్తే తప్పా సమస్య పరిష్కారం కాదు. విషయాన్ని ఈఓఆర్డీ వెంకటనాయుడు దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- న్యూస్‌టుడే, తపోవనం(అనంత గ్రామీణం)



వాహనాలు, నిర్మాణాలతో కుచించుకుపోయిన దారి